epaper.samayamdaily.net APTEL/2006/18267

# సమయం

మన గొంతుకే.. మన పత్రిక
తెలుగు దినపత్రిక

SAMAYAM

సంపుటి : 18 సంచిక : 243 | ఎడిటర్ : విక్రం కుమార్ | సోమవారం 12 మే 2025 | ప్రచురణ : హైదరాబాద్ | పేజీలు: 8 | వెల: రూ.5

epaper.samayamdaily.net APTEL/2006/18267
సమయం
మన గొంతుకే.. మన పత్రిక తెలుగు దినపత్రిక

**విలేకరులు కావలెను**

తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం. వినూత్న రీతిలో వెలువడుతూ విశేష ప్రజాదరణ పొందుతున్న సమయం న్యూస్ తెలుగు డిజిటల్ దినపత్రికకు విలేకరులు కావలెను.

ఆసక్తి అనుభవం కలిగిన వారు సంప్రదించగలరు.

జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గాల వారీగా ఆర్సీ ఇంచార్జీలు, మండలాల వారీగా విలేకరులు కావలెను. సీనియర్లకు ప్రాధాన్యం కొత్తవారికి అవకాశం ఉంటుంది.

ఫోన్ నెం : 99483 13985/ 89789 60131

# మన సైనిక సత్తా చాటాం

- సరిహద్దుల్లోనే కాదు.. రావల్పిండి వరకు వినిపించాం
- సిందూరం తుడిచేసిన వారిని శిక్షించాం
- ఆపరేషన్ సిందూర్‌పై రాజ్‌నాథ్
- అత్యంత కచ్చితత్వంతో లక్ష్యాలను ఛేదించాం: వాయుసేన
- పాక్ అత్యాధునిక యుద్ధ విమానాలను నేలకూల్చాం
- కీలక యుద్ధ స్థావరాలను పేల్చేశాం
- రక్షణ శాఖ ప్రకటన
- కశ్మీర్‌పై పరిష్కారానికి పాటుపడతా: ట్రంప్
- సరిహద్దుల్లో ప్రశాంతత.. నేడు డీజీఎంవోల చర్చలు

**మే 11, సమయం న్యూస్, ఢిల్లీ:** ఆపరేషన్ సిందూర్ ద్వారా భారత సైన్యం తన పరాక్రమాన్ని ప్రదర్శించిందని, పాక్ సైనిక ప్రధాన కార్యాలయం ఉన్న రావల్పిండిలోనూ గర్జించిందని రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. పహల్గాం ఉగ్రదాడి ద్వారా అనేక కుటుంబాల సిందూరాన్ని తుడిచేసినవారిని సైన్యం తగిన రీతిలో శిక్షించిందని చెప్పారు. ఇది కేవలం సైనిక చర్యే కాదని, ఉగ్రవాదంపై పోరులో భారత రాజకీయ, సామాజిక, వ్యూహాత్మక సంకల్పానికి నిదర్శనమని చెప్పారు. ఉగ్రవాదులతోపాటు భారత వ్యతిరేక శక్తులపై మన సైన్యం ప్రతీకారం తీర్చుకుందన్నారు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని లఖ్‌నవూలో

తరువాయి 2లో



# సరిహద్దు రాష్ట్రాల్లో ప్రశాంతత

- పంజాబ్, రాజస్థాన్, జమ్మూకశ్మీర్‌లో ఆగిన కాల్పులు

**మే 11, సమయం న్యూస్, చండీగఢ్/ఫిరోజ్‌పూర్/శ్రీనగర్:** కాల్పుల మోత మోగిన సరిహద్దు ప్రాంతాల్లో ప్రస్తుతం ప్రశాంతత కొనసాగుతోంది. కాల్పుల విరమణ జరిగినా శనివారం రాత్రి డ్రోన్లు, పేలుళ్లు, సైరన్ల మోతతో దద్దరిల్లిన జమ్మూకశ్మీర్‌లోని శ్రీనగర్‌లో బ్లాక్ అవుట్ ఎత్తివేశారు. జమ్మూ నగరంలోనూ పరిస్థితి సాధారణంగానే ఉన్నట్లు తెలుస్తోంది. అర్ధరాత్రి తర్వాత పాక్ నుంచి డ్రోన్లు,

తరువాయి 2లో



# పాక్ వెన్నువిరిచిన బ్రహ్మోస్




- ఇస్లామాబాద్ సమీప నూర్ ఖాన్ సహా పలు వైమానిక స్థావరాలు క్షణాల్లో ధ్వంసం
- శత్రు సైన్యానికి వణుకు పుట్టించిన సూపర్‌సోనిక్ క్రూజ్ క్షిపణి
- దెబ్బకు దిగి వచ్చి కాల్పుల విరమణకు అంగీకారం

**మే 11, సమయం న్యూస్, హైదరాబాద్:** ఢిల్లీ: పాకిస్థాన్‌తో ఘర్షణ తీవ్రమవుతున్న పరిస్థితుల్లో భారత్ తీసుకున్న ఓ కీలక నిర్ణయం శత్రువు వెన్నువిరిచేలా చేసింది. తన అమ్ముల పొదిలోని బ్రహ్మోస్ సూపర్‌సోనిక్ క్రూజ్ క్షిపణులను వ్యూహాత్మకంగా వినియోగించడంతో...అప్పటి వరకూ అణ్వాయుధాలున్నాయంటూ ప్రగల్భాలు పలికిన దాయాది దేశం వెన్నులో వణుకుపుట్టింది. మొత్తం పరిస్థితే మారిపోయింది. పాకిస్థాన్ అధికారిక రాజధాని ఇస్లామాబాద్ అయినా.. పాలన మొత్తం జరిగేది రావల్పిండి నుంచే. ఇక్కడ చక్లాలాలోని ఆ దేశ ఆర్మీ చీఫ్ కార్యాలయం నుంచే సైన్యానికి ఆదేశాలు వెళుతుంటాయి. శనివారం తెల్లవారుజామున భారత్ లక్ష్యంగా ఎంచుకున్న పాక్‌లోని కీలక ప్రాంతాల్లో రావల్పిండి సమీప నూర్ ఖాన్ వైమానిక స్థావరం అత్యంత ప్రధానమైనది.

తరువాయి 2లో

# అమరవీరుడికి కన్నీటి వీడ్కోలు

- అధికార లాంఛనాలతో జవాన్ మురళీనాయక్ అంత్యక్రియలు
- ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి లోకేశ్ నివాళులు
- ప్రభుత్వం తరపున 5 ఎకరాల పొలం, రూ.50 లక్షలు, ఇంటి స్థలం, తండ్రికి ఉద్యోగం
- వ్యక్తిగతంగా పవన్ కల్యాణ్ రూ.25 లక్షల సాయం ప్రకటన



2లో



# టాప్ ర్యాంకర్లయినా.. స్థానికేతరులైతే సీట్లు రావు!

- పునర్విభజన చట్టం 'పదేళ్ల గడువు' పూర్తవడంతో ఏపీ విద్యార్థులకు 15% కోటా రద్దు
- ఏడేళ్లలో నాలుగేళ్లు రాష్ట్రంలో చదివి ఉంటేనే లోకల్ కోటా సీట్లు
- ఎప్‌సెట్‌లో ఈ ఏడాది నుంచే అమలులోకి..వైకాపా ప్రభుత్వం రూపాయి కూడా ఖర్చు పెట్టలేదని ధ్వజం
- ఉరవకొండ నియోజకవర్గంలో పనుల పరిశీలన

**మే 11, సమయం న్యూస్, హైదరాబాద్:** తెలంగాణ ఎప్‌సెట్ ఇంజినీరింగ్ విభాగంలో పలువురు ఆంధ్రప్రదేశ్ స్థానికత కలిగిన విద్యార్థులు టాప్ ర్యాంకులు సాధించారు. అయితే విభజన చట్టంలో పేర్కొన్న పదేళ్ల గడువు పూర్తయిన నేపథ్యంలో ఈ విద్యాసంవత్సరం నుంచి అమలులోకి వస్తున్న కొత్త ఉత్తర్వుల ప్రకారం.. వీరు తెలంగాణలో కన్వీనర్ కోటాలో 15% సీట్లు పొందే అవకాశం లేదు. కన్వీనర్ కోటాలో 85 శాతం సీట్లను యథాతథంగా

తరువాయి 2లో

# నీరా.. సుందరీమణుల ఫిదా



- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**మే 11, సమయం న్యూస్, హైదరాబాద్:** ప్రపంచ దేశాల సుందరీమణులు తెలంగాణ సంప్రదాయ పానీయం నీరా రుచి చూశారు. ప్రకృతి ప్రసాదించిన పోషకాల పానీయాన్ని ఇష్టంగా తాగారు. కొబ్బరినీళ్లలా భలేగా ఉన్నాయంటూ కితాబిచ్చారు. అలాగే దొన్నెల్లో అందించిన తాటి ముంజలను ఎలా వలుచుకోవాలో ఆసక్తిగా తెలుసుకుని ఆరగించారు. మిస్ వరల్డ్ 2025 పోటీలకు

తరువాయి 2లో

# ఇంజినీరింగ్‌లో 73.26%..

- అగ్రికల్చర్‌లో 87.82% ఉత్తీర్ణత నమోదు
- ఎప్‌సెట్ ఫలితాలు విడుదల చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- ఇంజినీరింగ్‌లో తొలి పది ర్యాంకులు అబ్బాయిలకే... అగ్రికల్చర్‌లోనూ 9 కైవసం
- ఉత్తీర్ణతలో అమ్మాయిలే మెరుగు




2లో

# మన సైనిక సత్తా చాటాం...

సూపర్‌సోనిక్ బ్రహ్మోస్ ఉత్పత్తి, పరీక్షా కేంద్రాన్ని ఆదివారం ఆయన ఢిల్లీ నుంచి వర్చువల్‌గా ప్రారంభించి ప్రసంగించారు. మరో వైపు సైనికాధికారులు, వైమానిక దళాధికారులు విలేకరులతో మాట్లాడుతూ పోరులో పాక్‌ను చావుదెబ్బ కొట్టామని, భారీనష్టం కలిగించామని ప్రకటించారు. సరిహద్దుల్లో శాంతి నెలకొనడం ఆదివారం పెద్ద ఊరట.

*** పాక్ స్థావరాలనే లక్ష్యంగా చేసుకున్నాం**

''ఉగ్రశక్తులకు భారత్ దీటుగా బదులిస్తుంది. ఉగ్రవాదంపై పోరులో మనకున్న దృఢ సంకల్పంతోపాటు మన సైనిక శక్తిసామర్థ్యాలను ఈ ఆపరేషన్ చాటిచెప్పింది. పహల్గాం బాధితులకు న్యాయం చేకూరింది. పాక్ ప్రజలపై భారత్ దాడి చేయలేదు. అక్కడి ఉగ్ర స్థావరాలను నాశనం చేయడమే ధ్యేయంగా ఆపరేషన్‌ను చేపట్టాం. దాయాది మాత్రం భారత పౌరులే లక్ష్యంగా మన దేశంపై దాడులు చేసింది. పౌర ప్రాంతాలు, ఆలయాలు సహా మతపరమైన ప్రదేశాలపైనా దాడులకు ప్రయత్నించింది. మన సైన్యం శౌర్య పరాక్రమాలను ప్రదర్శించడమే కాకుండా సంయమనాన్ని పాటించింది. భారత్‌లో ఉగ్రచర్యలకు పాల్పడితే పర్యవసానాలు ఎలా ఉంటాయనేది ప్రపంచమంతా చూసింది. ఇది సరికొత్త భారతదేశమని, ఉగ్రవాద వ్యతిరేక చర్యలకు దీటైన జవాబును సరిహద్దుకు రెండువైపులా ఇస్తామని ప్రధాని మోదీ స్పష్టంచేశారు'' అని రాజ్‌నాథ్ చెప్పారు. ఉగ్రవాదంపై మనం చర్యలు తీసుకునేటప్పుడు ఉగ్రవాదులు, వారి పోషకులు దేశం అవతల ఉన్నా కూడా వారికి రక్షణ ఉండదని రుజువు చేశామని చెప్పారు. బ్రహ్మోస్ కేవలం ఆయుధం మాత్రమే కాదని.. అది సైనిక దళాల బలాన్ని, దేశ సరిహద్దుల్ని కాపాడుకునే సంకల్పాన్ని చాటే సందేశమని చెప్పారు. యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ మాట్లాడుతూ.. ఆపరేషన్ సిందూర్‌లో బ్రహ్మోస్ క్షిపణులను భారత్ ఉపయోగించిందని వెల్లడించారు. ఈ క్షిపణులకున్న శక్తి ప్రపంచ దేశాలకు తెలిసిందన్నారు. దీని ప్రభావం గురించి తెలియని వారెవరైనాఉంటే.. పాకిస్థాన్‌ను అడిగి తెలుసుకోవాలని సూచించారు. ఉగ్రవాదం అనేది కుక్కతోక లాంటిదని.. దానిని సరిచేయాలంటే వారి సొంత భాషలోనే బదులివ్వాలని పేర్కొన్నారు.

*** కశ్మీర్‌పై కలిసి పనిచేద్దాం: అమెరికా**

భారత్‌పాకిస్థాన్ దేశాలతో కలిసి కశ్మీర్ సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చెప్పారు. సంఘర్షణతో మరణాలు, విధ్వంసం తప్ప ఏమీ ఉండదనేది రెండు దేశాల నాయకత్వాలు అర్థం చేసుకున్నందుకు గర్వంగా ఉందని 'ట్రూత్ సోషల్' మాధ్యమంలో ఆయన వ్యాఖ్యానించారు. 'ఘర్షణలు ఇంకా కొనసాగి ఉంటే లక్షలమంది అమాయక ప్రజలు చనిపోవచ్చు. కాల్పుల విరమణపై చరిత్రాత్మక నిర్ణయం తీసుకోవడానికి అమెరికా సాయం చేసినందుకు నాకు గర్వంగా ఉంది. మీ రెండు దేశాల నాయకత్వాలకు దైవం ఆశీస్సులు ఉంటాయి. మనం కేవలం చర్చలు జరపడమే కాదు.. రెండు దేశాలతో వాణిజ్య సంబంధాలను మరింత బలోపేతం చేసుకుందాం. ఎన్నో ఏళ్లుగా నలుగుతున్న కశ్మీర్ విషయంలో పరిష్కారాన్ని అన్వేషించేందుకు మీతో కలిసి పనిచేస్తా' అంటూ పోస్ట్ చేశారు. ట్రంప్ తన తొలివిడత పాలనలో కూడా కశ్మీర్ విషయంలో జోక్యం చేసుకోవాలని అనుకున్నారు. అప్పటి భారత్, పాకిస్థాన్ ప్రధానుల వద్ద దానిగురించి ప్రస్తావించారు. తృతీయ పక్షం జోక్యాన్ని భారత్ తిరస్కరించింది. ఇప్పుడు మరోసారి ప్రతిపాదించారు. కశ్మీర్ వివాద పరిష్కారానికి చొరవ తీసుకుంటానని ట్రంప్ చెప్పడాన్ని పాక్ ఆహ్వానించింది.

*** దోభాల్‌తో మాట్లాడిన చైనా విదేశాంగ మంత్రి**

విభేదాలన్నింటినీ భారత్ పాక్‌లు చర్చల ద్వారా పరిష్కరించుకుని, దీర్ఘ కాలం పాటు కాల్పుల విరమణకు కట్టుబడి ఉంటాయని చైనా ఆకాంక్షించింది. రెండు దేశాల ప్రాథమిక ప్రయోజనాల పరిరక్షణకు, అంతర్జాతీయ సమాజ ఆకాంక్షలు నెరవేరడానికి ఇది అవసరమని పేర్కొంది. చైనా విదేశాంగ మంత్రి వాంగ్‌యీ ఆదివారం భారత జాతీయ భద్రతా సలహాదారుడు అజీత్ డోభాల్‌తో మాట్లాడారు. రెండుదేశాలూ సంయమనంతో వ్యవహరిస్తూ చర్చలు, సంప్రదింపుల ద్వారా విభేదాలను పరిష్కరించుకుంటాయని వాంగ్‌యీ ఆశాభావం వ్యక్తంచేశారు. భారత్, పాక్‌లు రెండూ తమకు సరిహద్దు దేశాలేనని గుర్తుచేశారు. పహల్గాం ఘటన సహా అన్ని రూపాల్లో ఉగ్రవాదాన్ని చైనా వ్యతిరేకిస్తుందన్నారు. యుద్ధం చేయడానికి తాము అనుకూలం కాదని, పహల్గాం దాడిలో వాటిల్లిన ప్రాణనష్టం తర్వాత ఉగ్రవాదులపై పోరాడాల్సి వచ్చిందని డోభాల్ ఈ సందర్భంగా చెప్పారు. పాక్ ప్రధాని షెహబాజ్‌తోనూ వాంగ్‌యీ మాట్లాడారు.

*** కాల్పుల విరమణ.. ఉద్రిక్తత తగ్గింపుపై భేటీ**

కాల్పుల విరమణ, అనంతర పరిస్థితిపై ఇరు దేశాల మధ్య సోమవారం మధ్యాహ్నం 12 గంటలకు కీలక చర్చలు జరగనున్నాయి. హాట్‌లైన్‌లో జరగనున్న ఈ చర్చల్లో రెండు దేశాల 'సైనిక కార్యకలాపాల డైరెక్టర్ జనరల్' (డీజీఎంవో)లు పాల్గొంటారు. కాల్పుల విరమణ కొనసాగింపు, ఉద్రిక్తత తగ్గించడం వంటి కీలక అంశాలు ప్రస్తావనకు వచ్చే అవకాశం ఉంది.

**ప్రధాని ఉన్నతస్థాయి సమీక్ష**

శనివారం రాత్రి పాక్ కాల్పుల ఉల్లంఘనకు పాల్పడిన తర్వాత తొలి సారిగా ప్రధాని మోదీ తర్వాత ఆదివారం తన నివాసంలో అత్యున్నతస్థాయి సమావేశం నిర్వహించారు. కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, జైశంకర్, త్రివిధ దళాధిపతులతో సమీక్ష జరిపారు. సరిహద్దుల్లో తాజా పరిస్థితిని జాతీయ భద్రతా సలహాదారు (ఎన్ఎస్ఏ) అజీత్ డోభాల్ వివరించారు.

**విరమణకు కట్టుబడి ఉన్నాం: పాక్**

భారత్‌తో కాల్పుల విరమణకు విశ్వాసపూర్వకంగా కట్టుబడి ఉన్నామని పాక్ తెలిపింది. తమ దళాలు బాధ్యత, సంయమనాలతో వ్యవహరిస్తున్నాయంది.

**చావు దెబ్బకొట్టాం**

''ఆపరేషన్ సిందూర్ ద్వారా సైనికంగా, రాజకీయంగా, మానసికంగా పాక్‌ను దెబ్బకొట్టాం. మన చేతిలో పాకిస్థాన్ ఓటమి పాలైంది. పాక్ వైమానిక స్థావరాలపై మనం దాడి చేయడంతో ఇక పోరాడలేమని దాయాది దేశం తెలుసుకుంది'' అని భారత విదేశీ వ్యవహారాల శాఖ మీడియాకు వివరించింది. భారత్ జరిపిన దాడుల్లో రహిమ్యార్‌ఖాన్ వైమానిక స్థావర రన్‌వే ధ్వంసమైనట్లు తెలిపింది. ఆపరేషన్ సిందూర్ ఇంకా ముగిలేదని స్పష్టం చేసింది. ''బహావల్‌పుర్‌లోని జైషేమహ్మద్ ఉగ్రవాద సంస్థ ప్రధాన కార్యాలయాన్ని నేలమట్టం చేశాం. బహావల్‌పుర్‌తోపాటు మురీద్కే, ముజఫర్‌బాద్ ఉగ్రవాద కేంద్రాలను నేలమట్టం చేశాం. ఈ నెల 10న పాకిస్థాన్ దాడికి ప్రతిస్పందనగా అగ్ని వర్షం కురిపించాం. మొత్తం 8 స్థావరాలు లక్ష్యంగా దాడులు చేశాం'' అని తెలిపింది. 'కశ్మీర్ విషయంలో మనకు స్పష్టమైన వైఖరి ఉంది. పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను మన దేశానికి అప్పగించడం మినహా మరో విషయం లేదు. ఉగ్రవాదుల అప్పగింతపై వాళ్లు మాట్లాడితే మేమూ మాట్లాడతాం. ఇందులో ఎవరి మధ్యవర్తిత్వాన్ని కోరుకోవడం లేదు' అని తెలిపింది. అణుయుద్ధం వరకు ఏ దశలోనూ వెళ్లలేదని స్పష్టంచేసింది. పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను భారత్‌కు తిరిగి అప్పగించడం గురించి తప్పిస్తే కశ్మీర్ అంశంలో పాక్‌తో ఎలాంటి చర్చలు ఉండవని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. కశ్మీర్ అంశంలో ఎవరి మధ్యవర్తిత్వమూ అవసరం లేదని తేల్చిచెప్పాయి. పాక్ ప్రేరేపిత ఉగ్రవాదం కొనసాగినన్నాళ్లూ సింధూ జలాల ఒప్పందం నిలిచిపోతుందని తెలిపాయి.

# టాప్ ర్యాంకర్లయినా.. స్థానికేతరులైతే సీట్లు రావు!

(మొదటిపేజీ తరువాయి)

స్థానికులకే కేటాయిస్తుండగా... మిగిలిన 15 శాతం స్థానికేతర కోటా సీట్లను కూడా తెలంగాణ మూలాలున్న కుటుంబాల్లోని విద్యార్థులకు మాత్రమే కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. అంటే తెలంగాణకు చెంది ఇతర రాష్ట్రాల్లో నివాసం ఉంటున్నవారు, ఇతర రాష్ట్రాల వారై ఉండి... తెలంగాణలో 'స్థానిక' అర్హత లేకపోయినా.. వారి తల్లి లేదా తండ్రి ఇక్కడ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తున్నట్లయితే.. ఆ విద్యార్థులు 15 శాతం నాన్ లోకల్ కోటా కింద సీట్లు పొందటానికి అర్హులు. గత పదేళ్లలో ఏటా 15 శాతం కోటాలో 3,500 నుంచి 4 వేల సీట్లలో ఏపీ విద్యార్థులు చేరేవారు. ఈసారి ఆ అవకాశం లేకపోవడంతో తెలంగాణ విద్యార్థులకు ఆ మేరకు ప్రయోజనం కలగనుంది. దానివల్ల ఈసారి ప్రముఖ కళాశాలల్లో కటాఫ్ ర్యాంకు కొంత పెరగవచ్చని భావిస్తున్నారు.

*** హైదరాబాద్‌లో ఇంటర్ చదివినా.. చేరలేరు..**

రాష్ట్రంలో స్థానిక కన్వీనర్ కోటాలో సీటు పొందాలంటే 6వ తరగతి నుంచి ఇంటర్ వరకు... అంటే ఏడేళ్లలో నాలుగేళ్లు తెలంగాణలో చదివి ఉండాలి. ఉదాహరణకు ఆరు నుంచి తొమ్మిదో తరగతి వరకు (లేదా) 9వ తరగతి నుంచి ఇంటర్ వరకు చదివిన వారిని స్థానికులుగా పరిగణిస్తారు. అయితే హైదరాబాద్‌లో పలు కార్పొరేట్ కళాశాలలు ఉండటంతో అనేక మంది ఏపీ విద్యార్థులు సొంత రాష్ట్రంలో పదో తరగతి వరకూ చదివి... ఇంటర్మీడియట్‌ను నగరంలో చదువుతున్నారు. ఇక్కడ వారు రెండేళ్లు మాత్రమే చదివినందున వారిని స్థానికేతరులుగానే పరిగణిస్తారు. వారు టాప్‌ర్యాంకులు సాధించినా తెలంగాణలో కన్వీనర్ కోటా సీటు పొందలేరని విద్యాశాఖ వర్గాలు చెబుతున్నాయి. విజయవాడలోని కార్పొరేట్ కళాశాలల్లో చదువుతున్న వందల మంది విద్యార్థులు సైతం సమీపంలోని కోదాడ, సత్తుపల్లిలో తెలంగాణ ఎప్‌సెట్ రాశారు. ఇతర బోర్డుల నుంచి అని దరఖాస్తు చేసి... పరీక్ష రాశారు. వారిలో అనేక మందికి ఉత్తమ ర్యాంకులు దక్కాయి. అయినా వారు ప్రవేశాలు పొందటానికి అర్హులు కాదని అధికారులు స్పష్టం చేస్తున్నారు. వాస్తవానికి వీరంతా ప్రాక్టీస్ కోసమే ఈ పరీక్షలు రాస్తుంటారని నిపుణులు చెబుతున్నారు.

*** గతంలోనూ టాప్ ర్యాంకర్లు..**

**ఇక్కడ చేరడం తక్కువే**

ఎప్‌సెట్‌లోని ఉత్తమ ర్యాంకర్లు దాదాపు అందరూ జేఈఈ మెయిన్‌లోనూ మంచి ర్యాంకులు సాధించిన వారే కావడం గమనార్హం. ఉదాహరణకు ఇంజినీరింగ్‌లో 2వ ర్యాంకర్ రామచరణ్‌రెడ్డికి జేఈఈ మెయిన్‌లో 53వ ర్యాంకు దక్కింది. మూడో ర్యాంకర్ హేమసాయి సూర్యకార్తీక్ మెయిన్‌లో 75వ ర్యాంకు సాధించాడు. వారు ఈ నెల 18వ తేదీన జరిగే జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు సన్నద్ధమవుతున్నారు. దాన్ని బట్టి వారు ఐఐటీలు లేదా టాప్ ఎన్ఐటీల్లో ప్రవేశాలు పొందుతారు. ఏపీ విద్యార్థులే కాదు... ఎప్‌సెట్‌లో టాప్ ర్యాంకులు సాధించిన తెలంగాణ విద్యార్థుల్లో సైతం రాష్ట్రంలోని ఇంజినీరింగ్ కళాశాలల్లో చేరేవాళ్లను వేళ్లపై లెక్కపెట్టవచ్చని నిపుణులు చెబుతున్నారు.

# అమరవీరుడికి కన్నీటి వీడ్కోలు

ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొని కశ్మీర్‌లో వీరమరణం పొందిన శ్రీసత్యసాయి జిల్లా గోరంట్ల మండలం కళ్లితండాకు చెందిన అగ్నివీర్ మురళీనాయక్‌కు ప్రజలు కన్నీటితో వీడ్కోలు పలికారు. తల్లిదండ్రులు, బంధువులు, గ్రామస్థుల శోకసంద్రం మధ్య సైనిక లాంఛనాలతో ఆదివారం అంత్యక్రియలు పూర్తి చేశారు. ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ కళ్లితండాకు చేరుకుని మురళీనాయక్‌కు నివాళులు అర్పించారు. ఆయన తల్లిదండ్రులను పరామర్శించి ధైర్యం చెప్పారు. మురళీనాయక్ చిన్నప్పటి నుంచే సైన్యంలో చేరతానని చెప్పేవాడని, జాతీయ జెండా కప్పుకొనే చనిపోతానని పదేపదే పేర్కొనేవాడని స్నేహితులు గుర్తు చేసుకున్నారు. అమరవీరుడికి నివాళి అర్పించేందుకు జిల్లా నలుమూలల నుంచి ప్రజలు వేలమంది తరలివచ్చారు.

**అన్ని విధాలుగా ఆదుకుంటాం**

మురళీనాయక్ కుటుంబాన్ని అన్నివిధాలుగా ఆదుకుంటామని ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి లోకేశ్ పేర్కొన్నారు. తల్లిదండ్రులకు మురళీనాయక్ ఏకైక సంతానం. ఆయన మరణంతో వారు ఒంటరిగా మిగిలిపోయారు. వారి కుటుంబానికి ప్రభుత్వం తరఫున రూ.50 లక్షలు ఆర్థిక సాయం చేయనున్నట్లు ప్రకటించారు. 5 ఎకరాల పొలం, 300 గజాల ఇంటి స్థలం ఇవ్వనున్నట్లు తెలిపారు. దీంతోపాటు వ్యక్తిగతంగా తాను రూ.25 లక్షలు అందిస్తానని పవన్‌కల్యాణ్ ప్రకటించారు. మంత్రి లోకేశ్ మాట్లాడుతూ మురళీనాయక్ తండ్రికి ప్రభుత్వ ఉద్యోగం ఇస్తామన్నారు. జిల్లా కేంద్రంలో జవాన్ కాంస్య విగ్రహం ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. గ్రామస్థుల విజ్ఞప్తి మేరకు కళ్లితండాను మురళీనాయక్ తండాగా మారుస్తామని పేర్కొన్నారు. అంత్యక్రియలు నిర్వహించిన స్థలాన్ని స్మారకంగా తీర్చిదిద్దుతామన్నారు.

**ఏర్పాట్లను పర్యవేక్షించిన లోకేశ్**

ఆదివారం ఉదయం 8.30 గంటలకు మురళీనాయక్ స్వగ్రామం కళ్లితండాకు చేరుకున్న మంత్రి లోకేశ్ అంత్యక్రియలు పూర్తయ్యే వరకు అక్కడే ఉన్నారు. జవాన్ తల్లిదండ్రులు, బంధువులకు ధైర్యం చెప్పారు. ఆపరేషన్ సిందూర్‌కు ముందు మురళీనాయక్.. స్నేహితుడు రాజశేఖర్‌తో జరిపిన వాట్సప్ సందేశాలను మంత్రి పరిశీలించారు. అంత్యక్రియలకు సంబంధించిన ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. మురళీనాయక్ భౌతికకాయాన్ని స్వయంగా మోశారు. అంత్యక్రియల వద్ద వీరుడి భౌతికకాయంపై పుష్పగుచ్ఛం ఉంచి సెల్యూట్ చేశారు. కార్యక్రమంలో మంత్రులు వంగలపూడి అనిత, అనగాని సత్యప్రసాద్, సవిత, సత్యకుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు పరిటాల సునీత, ఎం.ఎస్.రాజు, కందికుంట వెంకటప్రసాద్, దగ్గుబాటి ప్రసాద్, పల్లె సింధూరరెడ్డి, కాలవ శ్రీనివాసులు, హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**నా గుండె బరువెక్కింది: సీఎం**

మురళీనాయక్ కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని ముఖ్యమంత్రి చంద్రబాబు హామీ ఇచ్చారు. ఒక్కగానొక్క కుమారుడిని పోగొట్టుకున్న ఆ తల్లిదండ్రుల శోకంతో తన గుండె బరువెక్కిందని ఎక్స్ వేదికగా విచారం వ్యక్తం చేశారు. 'దేశం కోసం ఆయన ప్రాణత్యాగం ఎప్పుడూ స్ఫూర్తి రగిలిస్తూనే ఉంటుంది' అని చంద్రబాబు నివాళి అర్పించారు.

## సరిహద్దు రాష్ట్రాల్లో ప్రశాంతత

(మొదటిపేజీ తరువాయి)

కాల్పులు, బాంబు దాడులు నమోదు కాలేదు. అఖ్నూర్, రాజౌరి, పూంచ్ జిల్లాల్లోనూ పరిస్థితి సాధారణంగానే ఉన్నట్లు తెలుస్తోంది. అర్ధరాత్రి తర్వాత డ్రోన్లు, కాల్పులు, బాంబు దాడులు జరగలేదు. భద్రతా బలగాలు మాత్రం పూర్తిస్థాయి అప్రమత్తతతో ఉన్నాయి. పాకిస్థాన్‌తో సరిహద్దులు పంచుకుంటున్న పంజాబ్‌లోని పఠాన్‌కోట్, ఫిరోజ్‌పూర్, అమృత్‌సర్‌లోనూ పరిస్థితి సాధారణంగానే ఉన్నట్లు తెలుస్తోంది. అర్ధరాత్రి తర్వాత నుంచి డ్రోన్లు, కాల్పులు, బాంబు దాడులు జరగలేదు. కాల్పుల విరమణకు అంగీకరించిన పాక్ గంటల్లోనే డ్రోన్లు పంపడం వల్ల రాత్రి అమృత్‌సర్‌లో బ్లాక్‌అవుట్ అమలు చేశారు. ఆదివారం ఉదయం ఎత్తివేశారు. అనుమానం ఉన్న వాహనాలను పోలీసులు తనిఖీ చేస్తున్నారు. పాక్‌తో విస్తృత సరిహద్దు ఉన్న రాజస్థాన్ జిల్లాల్లోనూ ప్రస్తుతం పరిస్థితి సాధారణంగానే ఉంది. జైసల్మేర్ నగరంలో ఎలాంటి కాల్పులు, సైరన్ల మోతలు వినిపించడంలేదు. అయితే ముందు జాగ్రత్తగా సరిహద్దు ప్రాంతాల్లో అధికారులు బ్లాక్‌అవుట్ విధించారు.

**ఇళ్లకు అప్పుడే రావొద్దు**

స్వస్థలాలకు అప్పుడే వెళ్లొద్దని పాకిస్థాన్ షెల్లింగ్ కారణంగా సురక్షిత ప్రాంతాల్లో ఉన్న సరిహద్దు గ్రామప్రజలను జమ్మూకశ్మీర్ యంత్రాంగం హెచ్చరించింది. పేలని షెల్స్ ఇంకా ఉంటాయని, వాటిని గుర్తించాల్సి ఉందని పేర్కొంది. భారత్ పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు నేపథ్యంలో ఆదివారం ఒక్కరోజే ఢిల్లీ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి రాకపోకలు సాగించే దాదాపు 100 విమాన సర్వీసులు రద్దయినట్లు అధికారిక వర్గాలు తెలిపాయి.

## పాక్ వెన్నువిరిచిన బ్రహ్మోస్

(మొదటిపేజీ తరువాయి)

ఇక్కడ గగనతల రీఫ్యూయలర్ ట్యాంకర్ విమానాలు, భారీ రవాణా విమానాలు ఉన్నాయి. అప్పటికే పాకిస్థాన్ సైన్యం ఢిల్లీ లక్ష్యంగా ప్రయోగించిన ఫతాహ్ 11 బాలిస్టిక్ క్షిపణులను భారత బలగాలు... గగనతల రక్షణ వ్యవస్థ ఎస్ 400తో మధ్యలోనే పేల్చివేసింది. శుక్రవారం అర్ధరాత్రి శ్రీనగర్ నుంచి నలియా వరకు 26 లక్ష్యాలపైకి పాక్ క్షిపణులు, డ్రోన్లు ప్రయోగించగా వాటన్నింటినీ భారత రక్షణ దళాలు సమర్థంగా అడ్డుకున్నాయని అధికారులు వెల్లడించిన విషయం తెలిసిందే. ప్రతిగా భారత్ శనివారం తెల్లవారుజామున అత్యాధునిక క్షిపణులు, గైడెడ్ మ్యూనిషన్, లాయిటరింగ్ మ్యూనిషన్‌ను వాడినట్లు తెలుస్తోంది. వీటిలో బ్రహ్మోస్ సూపర్ సోనిక్ క్రూజ్ క్షిపణులు అత్యంత కీలక పాత్ర పోషించాయి. సుఖోయ్30 ఎంకేఐ యుద్ధ విమానాల ద్వారా ప్రయోగించిన బ్రహ్మోస్ క్షిపణులు పాకిస్థాన్ భూభాగాల లోపలి వరకూ వెళ్లి ఆ దేశానికి చెందిన పలు వైమానిక స్థావరాలను దెబ్బతీశాయని వివిధ వర్గాల నుంచి అందుతున్న సమాచారం తెలియజేస్తోంది. ధ్వంసమైన వైమానిక స్థావరాల్లో...రఫీకీ, మురీద్, నూర్‌ఖాన్, రహీంయార్ ఖాన్, సుక్కుర్, చునియన్. పర్సూర్, సియాల్‌కోట్ ఉన్నాయి. పంజాబ్ ప్రావిన్స్‌లోని రఫీకీ వైమానిక స్థావరం అత్యాధునిక విమానాలకు కేంద్రం. 10,000 అడుగుల రన్‌వే ఇక్కడి ప్రత్యేకత. అత్యవసర ల్యాండింగ్ స్ట్రిప్‌లు ఉన్నాయి. పంజాబ్ ప్రావిన్స్‌లోని చక్వాల్‌లో మురీద్ ఉంది. ఇక్కడ కీలక వైమానిక స్థావరం ఉంది. మానవరహిత సాయుధ డ్రోన్లను ఇక్కడ నిల్వ చేస్తుంటారు. ఇస్లామాబాద్‌కు అత్యంత సమీపంలోని రావల్పిండిలో నూర్ ఖాన్ (చక్లాలా) వైమానిక స్థావరం ఉంది. పాక్ ఉన్నతస్థాయి జనరల్స్ ఇక్కడ భేటీ అవుతారు. ఆర్మీ చీఫ్ ఆసిం మునీర్ కార్యాలయం కూడా చక్లాలాలోనే ఉంది. ముఖ్యమైన ఈ వైమానిక స్థావరాలను భారత్ దెబ్బతీయడంతో పాకిస్థాన్‌కు ఎటూపాలుపోని పరిస్థితి ఏర్పడింది. అంతకుముందే ఆ దేశ గగనతల రక్షణ వ్యవస్థలనూ పేల్చివేయడంతో భారత క్షిపణులను శత్రు సైన్యం గుర్తించలేకపోయింది. ఈ పరిస్థితుల్లో తమ వద్ద ఉన్న అణ్వాయుధాలను వినియోగించటం ఏమోగాని, వాటిని కాపాడుకోవటమూ కష్టమని స్పష్టం కావడంతో పాక్ నాయకత్వం చేతులెత్తేసింది. శనివారం మధ్యాహ్నానికి కాల్పుల విరమణకు సిద్ధమైందని రక్షణ నిపుణులు విశ్లేషిస్తున్నారు.

**రాజ్‌నాథ్ సింగ్ మాటల్లో...**

పాకిస్థాన్ వైమానిక స్థావరాలను ధ్వంసం చేయడానికి బ్రహ్మోస్ క్షిపణులను వినియోగించినట్లు భారత రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ మాటల ద్వారా స్పష్టమవుతోంది. యుద్ధ రంగంలో వీటిని ఉపయోగించడం ఇదే తొలిసారి. భారత్ నిమిషాల వ్యవధిలో పాక్‌కు చెందిన కీలక వైమానిక స్థావరాలను ధ్వంసం చేయడం ఆ దేశంలో గుబులు రేపింది.

## నీరా.. సుందరీమణుల ఫిదా

(మొదటిపేజీ తరువాయి)

వచ్చిన అందగత్తెలు ఆదివారం నెక్లెస్‌రోడ్డులోని నీరా కేఫ్‌లో సందడి చేశారు. గీత కార్మికులు తాటి దొన్నెల్లో, ప్రత్యేక టిన్నుల్లో వారికి నీరా అందించారు. అందాల పోటీలు శనివారం ప్రారంభం కాగా ఆదివారం ఎక్కువ మంది భామలు హోటల్‌కు పరిమితమై విశ్రాంతి తీసుకున్నారు. కొంత మంది మాత్రం విడతల వారీగా హుస్సేన్‌సాగర్ తీరంలో ఏర్పాటు చేసిన వేడుకల్లో నృత్యాలు చేస్తూ సందడి చేశారు.

## ఇంజినీరింగ్‌లో 73.26% .. అగ్రికల్చర్‌లో 87.82% ఉత్తీర్ణత నమోదు

హైదరాబాద్: తెలంగాణ ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మా ఉమ్మడి ప్రవేశ పరీక్ష (ఈఏపీసెట్ ఎప్‌సెట్) ఇంజినీరింగ్ విభాగంలో 73.26%... అగ్రికల్చర్ ఫార్మా విభాగంలో 87.82% మంది ఉత్తీర్ణులయ్యారు. రెండు విభాగాల్లో అబ్బాయిలే టాప్ ర్యాంకు సాధించారు. ఇంజినీరింగ్‌లో తొలి పది ర్యాంకులు, అగ్రికల్చర్ విభాగంలో మొదటి పదిలో తొమ్మిది ర్యాంకులను అబ్బాయిలే కైవసం చేసుకున్నారు. ఇంజినీరింగ్‌లో అబ్బాయిలు 72.79%, అమ్మాయిలు 73.88% మంది ఉత్తీర్ణులుకాగా... అగ్రికల్చర్‌లో అబ్బాయిలు 86.29%, అమ్మాయిలు 88.32% మంది ఉత్తీర్ణులయ్యారు. రెండింటిలోనూ అమ్మాయిల అర్హత శాతం అధికంగా ఉండటం విశేషం. ఎప్‌సెట్ ఇంజినీరింగ్, అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ విభాగాల ర్యాంకులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదివారం తన నివాసంలో విడుదల చేశారు. ఉత్తీర్ణులైన వారందరికీ శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఛైర్మన్ వి.బాలకిష్టారెడ్డి, విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా, జేఎన్‌టీయూహెచ్ ఉపకులపతి టి.కిషన్‌కుమార్‌రెడ్డి, రాష్ట్ర సాంకేతిక విద్య కమిషనర్ శ్రీదేవసేన, ఉన్నత విద్యామండలి ఉపాధ్యక్షుడు పురుషోత్తం, కార్యదర్శి శ్రీరాం వెంకటేశ్, ఎప్‌సెట్ కన్వీనర్ బి.డీన్‌కుమార్, కోకన్వీనర్ కె.విజయకుమార్‌రెడ్డి, జేఎన్‌టీయూహెచ్ రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావు, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్‌రెడ్డి పాల్గొన్నారు.

**వరుసగా రెండేళ్లు ఉత్తరాంధ్ర విద్యార్థులదే తొలి ర్యాంకు**

ఇంజినీరింగ్‌లో ఏపీలోని పార్వతీపురం జిల్లా కొమరాడకు చెందిన పల్లా భరత్‌చంద్ర 160 మార్కులకు 150.058 సాధించి ప్రథమ ర్యాంకు పొందాడు. ఈ విద్యార్థి ఇంటర్మీడియట్‌ను హైదరాబాద్‌లోనే చదివాడు. ఈ విభాగంలో 138.25 మార్కులకు పదో ర్యాంకు దక్కింది. గత ఏడాది ఎప్‌సెట్‌లో కూడా శ్రీకాకుళం జిల్లా పాలకొండకు చెందిన సతివాడ జ్యోతిరాదిత్య 160కి 155.63 మార్కులు సాధించి ప్రథమ ర్యాంకు కైవసం చేసుకున్నాడు.



డిప్యూటీ మున్సిపల్ కమిషనర్ జిహెచ్ఎంసి అంబర్ పేట సర్కిల్ మారుతి దివాకర్ కుమారుడి వివాహనికి హాజరైన అంబర్ పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్.

*- అంబర్ పేట, సమయం న్యూస్:*

# జాగిలాలతో గజ్వేల్ లో నార్కోటిక్ డ్రగ్స్ తనిఖీలు





గజ్వేల్, మే11 : గజ్వేల్ పట్టణంలో ఆదివారం నార్కోటిక్ డాగ్స్ తో పోలీసులు మత్తు పదార్థాల కోసం విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. బస్టాండ్, ఇంటి గ్రేటెడ్ మార్కెట్, హనుమాన్ టెంపుల్ రోడ్, శివారు ప్రాంతంలో నార్కోటిక్ డాగ్స్ తో విస్తృతంగా తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా గజ్వేల్ అడిషనల్ ఇన్స్పెక్టర్ ముత్యం రాజు మాట్లాడుతూ పోలీస్ కమిషనర్ అనురాధ ఆదేశాల మేరకు అనుమానాస్పద ప్రదేశాలలో డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాల గురించి నార్కోటిక్ డాగ్స్ తో తనిఖీలు నిర్వహించామన్నారు. గంజాయి ఇతర మత్తు పదార్థాలు, మత్తు పదార్థాలు కలిపిన చాక్లెట్స్ ఎవరైనా కలిగి ఉన్నా, అక్రమంగా రవాణా చేసినా, పాన్ షాపులలో కానీ ఇతర షాపులలో అమ్మినా చట్ట ప్రకారం కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. గంజాయి ఇతర మత్తుపదార్థాల బారిన పడకుండా తల్లిదండ్రులు పిల్లలను ఒక కంటితో కనిపెడుతూ ఉండాలన్నారు. గంజాయి ఇతర మత్తుపదార్థాలు ఎవరైనా కలిగి ఉంటే అమ్మిన విక్రయించిన వెంటనే 100 ఫోన్ నెంబర్కు గాని, గజ్వేల్ పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఈ తనిఖీలలో గజ్వేల్ ఎస్ఐ ఉమా రెడ్డి, పోలీస్ సిబ్బంది డాగ్ స్క్వాడ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





## అంబర్ పేట ఆంజనేయ స్వామి దేవాలయంలో లక్ష్మీనరసింహస్వామి జయంతి ఉత్సవాలు

అంబర్ పేట, మే, 11(సమయం న్యూస్) : శ్రీ లక్ష్మీనరసింహస్వామి జయంతి సందర్భంగా శ్రీ వీర అభయాంజనేయ స్వామి సహిత పర్వత వర్ధిని సమేత రామలింగేశ్వర స్వామి వారి దేవాలయంలో, శ్రీ లక్ష్మి నరసింహస్వామి తిరు నక్షత్ర సందర్భంగా లక్ష్మీనరసింహస్వామి వారి కళ్యాణ వైభవంగా ప్రధాన అర్చకులు ఆచార్య ఆత్రేయ గారి ఆధ్వర్యం లో జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు మరియు శ్రీరామ సేవకులు, ప్రేమ్ నగర్ భక్తజన బృందం మరియు విశ్వ భారతి యూత్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

# బోధన్ మజ్లిస్ పార్టీకి కొత్త నేతలు

* **మీర్ ఇలియాస్ అలీ అధ్యక్షుడిగా ఎన్నిక మంగళవారం సన్మాన కార్యక్రమం**

బోధన్ పట్టణం, మే 11 సమయం న్యూస్ : ఇటీవల హైదరాబాదులో ఆల్ ఇండియా మజ్లిస్ ఎ ఇత్తెహాదుల్ ముస్లిమీన్ (ఏఐఎంఐఎం) పార్టీ రాష్ట్ర కమిటీ ఆదేశాల సారం, నిజామాబాద్ జిల్లా కమిటీ వారు బోధన్ పట్టణానికి నూతన కమిటీ ఎన్నుకోవడం జరిగింది. ఈ నూతన అధ్యక్షుడిగా మీర్ ఇలియాస్ అలీ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన మీరు ఇలియాస్ అలీ ఆదివారం రోజున తన నివాసంలో మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ కమిటీని



ఏఐఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఓవైసీ, మలక్ పేట్ ఎమ్మెల్యే అహ్మద్ బిలాల్ మార్గదర్శకత్వంలో ఏర్పాటు చేయడం జరిగిందని, నూతనంగా ఎన్నిక కాబడిన కమిటీ కి మే 13, మంగళవారం మఘ్రిబ్ నమాజు, సాయంత్రం 7:30 గంటలకు రాకాసిపేట్ లోని మర్హబా ఫంక్షన్ హాల్ లో అభినందన సభ జరగనుందనీ, ఈ కార్యక్రమానికి నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు ఫయాజ్ అహ్మద్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారనీ తెలిపారు. రెంజల్ బేస్ లోని హజ్రత్ సయ్యద్ షాహ్ జలాల్ బుఖారీ (ర.అ) దర్గాలో చాదర్ కప్పడం జరుగుతుందని, తదనంతరం వద్ద గల మీర్ ఇలియాస్ అలీ నివాసంలో భోజన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందనీ, కావున ఎంఐఎం మాజీ కౌన్సిలర్ లు, పార్టీ ప్రతినిధులు, ప్రజలందరిని ఐక్యతతో పాల్గొనాలని ఆయన కోరారు. ఇట్టి కార్యక్రమంలో ఎంఐఎం బోధన్ కమిటి ప్రధాన కార్యదర్శి అహ్మద్ బిన్ మోసిన్, కోశాధికారి హబీబ్ ఖాన్ ఖదీర్, అల్తాఫ్, సమీర్, తదితరులు పాల్గొన్నారు.



## కన్నుల పండుగలా శ్రీ లక్ష్మీనరసింహుని కళ్యాణ్

* **ముగిసిన దిలాల్పూర్ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు**

గజ్వేల్,మే 11 : మండల పరిధిలోని బిలాల్పూర్ గ్రామంలో వెలసిన స్వయంభు లక్ష్మీనరసింహస్వామి కళ్యాణం ఆదివారం అంగరంగ వైభవంగా జరిగింది. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో, రఘునాథచార్యులు వైదిక నిర్వహణలో నాలుగు రోజులుగా కొనసాగుతున్న కొనసాగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం నరసింహ జయంతిని పురస్కరించుకొని స్వామివారి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. అంతకుముందు సుదర్శన హోమం, మహా పూర్ణాహుతి, చక్ర స్నానం నిర్వహించారు. సాయంత్రం స్వామి వారి సన్నిధిలో పుష్పర్చన, సాయంత్రం పల్లకి సేవ నిర్వహించారు.

# జనాభా దామాషా ప్రకారం బీసీలకు వాటా అందించాలి

* **బీసీ ఆజాది ఫెడరేషన్ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షులు జక్కని సంజయ్ కుమార్**

మంచిర్యాల జిల్లా ప్రతినిధి, మే 11 సమయం న్యూస్: రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసిన 42 శాతం రిజర్వేషన్ బిల్లు అమలు చేయాలని, దేశ వ్యాప్తంగా కుల గణన ప్రక్రియ శాస్త్రీయ పద్ధతిలో వెంటనే చేపట్టాలని బీసీ ఆజాది ఫెడరేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన బీసీ మేలు కోలుపు రథ ఆదివారం మంచిర్యాల జిల్లా మందమర్రి మండల కేంద్రానికి చేరుకున్నది. ఈ యాత్రలో బీసీ నేతలు పాల్గొని జనాభా ప్రాతిపదికన బీసీలకు విద్యా, ఉద్యోగ, వ్యాపార, రాజకీయ రంగాలలో వాటాను అందించాలని, మేమెంతో మాకంత వాటా నినాదంతో బీసీ మేలు కొలుపు రథ యాత్ర మందమర్రి మండల కేంద్రంలోకి చేరుకుంది, స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో జరిగిన కార్యమంలో ప్రజా సంఘాలు, కుల సంఘాలు నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా బీసీ ఆజాది ఫెడరేషన్ జాతీయ అధ్యక్షులు జక్కని సంజయ్ కుమార్ మాట్లాడుతూ, ఈ దేశ జనాభాలో సగానికి పైగా ఉన్న బీసీలకు సరైన అవకాశాలు లేక అన్ని రంగాల్లో వెనుకబడి అణగారిన వర్గాలుగా, పేదవారుగా ఉన్నారని నిజానికి ఈ దేశానికి మూల నివాసులైన ప్రజలు మెజారిటీ ప్రజలు బీసీలనీ, ఈ స్వతంత్ర భారతదేశంలో మెజారిటీ ప్రజల లక్ష్యాలను పక్కనపెట్టి కార్పొరేటీకరణకు, పెట్టుబడిదారులకు ప్రభుత్వాలు వత్తాసు పలుకుతున్నాయని అన్నారు. విద్యా, ఉద్యోగ, వ్యాపార, రాజకీయ రంగాలలో బీసీలకు జనాభా ప్రాతిపదికన అవకాశాలను కల్పించాలని, జనాభా ప్రాతిపదికన వాటాను అందించాలని తద్వారా బీసీల అభివృద్ధి సాధించి ప్రతి పౌరుడు అభివృద్ధి ద్వారా దేశ అభివృద్ధి సాధ్యమవుతుంది కాబట్టి దేశ అభివృద్ధికి దోహదపడాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. గతంలో బీసీల ప్రాథమిక హక్కు అయిన కుల గణన సాధన కోసం 78 సంవత్సరాలుగా బీసీలు పోరాడుతున్న ప్రభుత్వాలు వంచించడం తప్ప చిత్తశుద్ధితో పనిచేయడం లేదని, బీసీల అభివృద్ధి కోసం మండల కమిషన్ చేసిన సిఫారసులను తుంగలో తొక్కారని ఈ దేశానికి స్వాతంత్రం వచ్చాక బీసీలకు స్వాతంత్రం పోయిందని, కాబట్టి విద్యా, ఉద్యోగ, వ్యాపార, రాజకీయ, సామాజిక రంగాలలో మేమెంతో మాకంత వాటాను సాధించినప్పుడే నిజమైన విముక్తిని సాధిస్తామని తెలిపారు. బీసీల అభివృద్ధి కోసం నిరంతరం పోరాటం చేస్తున్నామని, బీసీ ఉద్యమాన్ని ప్రతి పల్లెలో బలోపేతం చేసి ప్రతి పల్లెలో బీసీ



జెండాను ఎగరవేయడమే లక్ష్యంగా బీసీ ఆజాది ఫెడరేషన్ ఆధ్వర్యంలో సుదీర్ఘకాలం పాటు బీసీ మేలుకొలుపు రథయాత్రను తెలంగాణ జాతిపిత, తెలంగాణ సామాజిక ఉద్యమాల పితామహుడు ఆచార్య కొండ లక్ష్మణ్ బాపూజీ స్ఫూర్తితో వారి స్వగ్రామంలో ప్రారంభించడం జరిగిందని ఈ యాత్ర అలంపూర్ లో ముగుస్తుందన్నారు. ఈ యాత్రకు స్థానిక నాయకులు సకినాల శంకర్, కొండిల్ల శ్రీనివాస్, నేరెళ్ళ వెంకటేష్, ముడారపు శేఖర్ తదితరులు స్వాగతం పలుకగా వడ్డేపల్లి మనోహర్ అధ్యక్షత వహించారు, ఈ సందర్భంగా స్థానిక నాయకులు మాట్లాడుతూ, బీసీల హక్కుల కోసం నిరంతరం పోరాటం చేస్తున్న జక్కని సంజయ్ కుమార్, బీసీల పోరాటాన్ని ప్రతి పల్లెకు చేర్చేందుకు పోరాడుతున్నారని వారి పోరాటం ఫలించాలని ఆకాంక్షించారు. ప్రతి పల్లెలో బీసీలు ఐక్యంగా ఉండాలని తద్వారా బీసీల హక్కులను సాధిస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం జక్కని సంజయ్ కు ఘనంగా శాలువాతో సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో రజక రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు చాపర్తి కుమార్ గాడ్గే, బీసీ ఆజాది ఫెడరేషన్ రాష్ట్ర కార్యనిర్వహక అధ్యక్షులు కుడికల భాస్కర్, జీనుకల లక్ష్మన్ రావు, ఉమ్మడి జిల్లా ఇన్చార్జి సుంకటి పోశెట్టి, రజక రిజర్వేషన్ పోరాట సమితి అధ్యక్షులు చాపర్తి కుమార్ గాడ్గే, గుమ్ముల శ్రీనివాస్, విద్యార్థి నాయకులు వంశి నేత, నామాని అర్జున్, స్థానిక కుల సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## శ్రీ కోట మైసమ్మ సహిత లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో ఘనంగా స్వామివారి జన్మోత్సవ, కళ్యాణ మహోత్సవం

బోధన్ పట్టణం, మే 11, సమయం న్యూస్ : నిజామాబాద్ జిల్లా బోధన్ పట్టణంలోని బసవతారకనగర్ లో గల శ్రీ కోట మైసమ్మ సహిత శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో ఆదివారం వైశాఖ మాసం స్వాతి నక్షత్రంలో స్వామి వారి జన్మోత్సవం, కళ్యాణ మహో త్సవం శోభాయమానంగా నిర్వహించబడింది. లోకక్షేమానికి, దుష్టశిక్షణ శిష్టరక్షణ కోరికతో అవతరించిన స్వామివారి ఆవిర్భావ దినాన్ని భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో జరిపారు. వేదపండితులు ప్రవీణ్ మహారాజ్, రోహిత్ శర్మ నేతృత్వంలో అభిషేకాలు, కుంకుమార్చనలు నిర్వహించబడ్డాయి. ముఖ్య అతిథిగా మల్లారం గుట్ట పిట్ట కృష్ణ మారాజు హాజరై భక్తులకు సందేశం అందించారు. అనంతరం అన్నప్రసాద వితరణ, తీర్థప్రసాదాలు భక్తులకు పంపిణీ చేయడం జరిగింది. ఆలయ వ్యవస్థాపకులు పసులేటి సంధ్యా లక్ష్మి, గోపి కిషన్ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. పాల్గొన్నవారిలో లోకేష్, రుక్మిణి, కోనేటి కృష్ణ, జనార్ధన్, భీమ్రావు, కుమార్, కిషోర్, అక్షయ్, లింగం, గౌతమ్, బిల్లా విజయ్ తదితరులు ఉన్నారు.

# సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి

మంచిర్యాల జిల్లా ప్రతినిధి, మే 11 సమయం న్యూస్: మే 20న నిర్వహించనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె లో సింగరేణి కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు కోరారు. మంచిర్యాల జిల్లా మందమర్రి పట్టణంలోని సిఈఆర్ క్లబ్ లో ఆదివారం నిర్వహించిన యూనియన్ జిల్లా సమితి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి





ప్రభుత్వం కార్మికుల హక్కులను హరించడానికి 44 కార్మిక చట్టాలను నాలుగు కోడ్ లుగా కుదించి కార్మిక, కర్షక వర్గానికి తీవ్ర అన్యాయం చేసిందనీ ఆయన కేంద్ర ప్రభుత్వం పై విరుచుకు పడ్డారు. సంపాదన సృష్టించే కార్మికులకు అన్యాయం చేస్తూ, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు పరం చేసే విధంగా కేంద్ర ప్రభుత్వం అడుగులు వేస్తుందని, ఈ విధానాలను వ్యతిరేకిస్తూ మే 20వ తేదీన దేశవ్యాప్త సమ్మె నిర్వహించి కేంద్ర ప్రభుత్వానికి కళ్ళు తెరిపించాలని కార్మిక వర్గానికి విజ్ఞప్తి చేశారు. కేంద్ర ప్రభుత్వం చట్ట సవరణను వెంటనే విరమించుకొని 44 చట్టాలను యధాతధంగా అమల్లోకి తేవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు ఎండీ అక్బర్ అలీ, సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, మిట్టపల్లి పౌలు, ముస్కే సమ్మయ్య, కలిందర్ అలీ ఖాన్, తోకల సరస్వతి, దాగం మల్లేష్, సలేంద్ర సత్యనారాయణ, బీమనాధుని సుదర్శన్, దేనబోయిన బాపు, జాడి పోషం, శంకర్ లు పాల్గొన్నారు.

# వివాదంలో తెలంగాణ ఎప్‌సెట్ ఫలితాలు.. హరీశ్ రావు ఖండన



తెలంగాణ ఇంజినీరింగ్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన ఎప్‌సెట్ రిజల్ట్స్ విడుదలయ్యాయి. ఆ ఫలితాల విడుదల తీవ్ర వివాదస్పదమైంది. రాజకీయ దుమారానికి తెరలేపింది. అధికారిక కార్యాలయంలో.. భవనాల్లో.. నివాసాల్లో విడుదల చేయాల్సి ఉండగా.. ముఖ్యమంత్రి తన సొంత నివాసంలో విడుదల చేయడం వివాదానికి దారి తీసింది. గతంలో ఏ ముఖ్యమంత్రులు ఇలా సొంత నివాసాల నుంచి ఫలితాలు విడుదల చేయలేదు. ఈ వ్యవహారంపై బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ మంత్రి హరీశ్ రావు స్పందిస్తూ.. రేవంత్ రెడ్డి వైఖరిని ఖండించారు. '77 ఏళ్ల స్వతంత్ర భారతదేశంలో పోటీ పరీక్షల ఫలితాలను ఏ ముఖ్యమంత్రి కూడా తమ ఇంటి నుంచి విడుదల చేయలేదు. ఇది రేవంత్ రెడ్డి అహంభావానికి నిదర్శనం' అని మాజీ మంత్రి హరీశ్ రావు తెలిపారు. EAPCETలో ర్యాంకులు సాధించిన విద్యార్థులకు శుభాకాంక్షలు చెబుతూనే రేవంత్ రెడ్డిపై తీవ్ర విమర్శలు చేశారు. ఎప్‌సెట్ ఫలితాలపై 'ఎక్స్' వేదికగా స్పందించారు.న 'తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించే EAPCET 2025 ఫలితాలను జూబ్లీహిల్స్ ప్యాలెస్ నుంచి విడుదల చేయడం రేవంత్ రెడ్డి అహంభావం, పాలన మీద, విద్యార్థుల మీద ఉన్న చులకన భావాన్ని తెలియజేస్తుంది' అని ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ఇప్పటివరకు ఏ ముఖ్యమంత్రి, మంత్రులు కూడా 77 ఏళ్ల స్వతంత్ర భారతదేశంలో పోటీ పరీక్షల ఫలితాలను తమ ఇంటి నుంచి విడుదల చేయలేదు' అని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు గుర్తుచేశారు. 'అయితే కమాండ్ కంట్రోల్ కేంద్రం నుంచి లేక జూబ్లీహిల్స్ ప్యాలెస్ నుంచి పాలన కొనసాగించే రేవంత్ రెడ్డి పోలీసులను పని చేసుకోనివ్వడం లేదు, ఇటు అధికారులను పని చేయనివ్వడం లేదు' అని మండిపడ్డారు. అసలు సచివాలయం ముఖం చూడడం లేదని.. ప్రజా పాలన అంటే ఇదేనా?? అని మాజీ మంత్రి హరీశ్ రావు ప్రశ్నించారు.

**ఫలితాలు విడుదల**

తెలంగాణ ఇంజినీరింగ్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన ఎప్‌సెట్ రిజల్ట్స్ వెల్లడైన విషయం తెలిసిందే. ఏప్రిల్ 29, 30 తేదీల్లో ఎప్‌సెట్ అగ్రికల్చర్ విభాగానికి పరీక్షలు నిర్వహించగా.. 81,198 మంది విద్యార్థులు హాజరయ్యారు. మే 2, 3, 4 తేదీల్లో నిర్వహించిన ఇంజినీరింగ్ విభాగం పరీక్షలు 2,07,190 మంది రాశారు. విద్యార్థులు https://eapcet.tgche.ac.in వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చు. మార్కులు, ర్యాంక్ మెసేజ్ రూపంలో వస్తాయి.



## ఇస్కాన్ కేంద్రంలో ఘనంగా శ్రీ నరసింహ స్వామి జయంతోత్సవము

బోధన్ పట్టణం, మే 11, సమయం న్యూస్ : వైశాఖ శుద్ధ చతుర్దశి శ్రీ నరసింహ స్వామి జయంతి సందర్భంగా నిజామాబాద్ జిల్లా బోధన్ పట్టణంలోని ఇస్కాన్ కేంద్రంలో ఆదివారం రోజున శ్రీ నరసింహ స్వామి జయంతోత్సవంను వైభవక్తంగా, శోభాయ మానంగా నిర్వహించడం జరిగింది. ప్రాతఃకాలం నుండి స్వామివారికి అభిషేకాలు అర్చనలు మంగళహారతులను, శ్రీమద్ భాగవత ఉపన్యాసమును నిర్వహించారు. ఉదయం 10:00 నుండి మధ్యాహ్నం 3:00 గంటల వరకు ఆయుర్వేద హెల్త్ క్యాంపు నిర్వహించారు. సుదర్శన నరసింహ మహా యజ్ఞం నిర్వహించడం జరిగింది. సాయంత్రం హరినామ సంకీర్తనలను, పిల్లలచే సాంస్కృతిక కార్యక్రమాలు, అనంతరం నరసింహస్వామి విగ్రహానికి పంచామృతం, పలు రకాల ఫలాల ఫలామృతాలతో మహాశంకభిషేకం నిర్వహించారు. నరసింహ స్వామి వారి జన్మ ఇతిహాసాన్ని భక్తులకు వివరించారు. పిల్లలచే నిర్వహించిన నరసింహ స్వామి జన్మ సాంస్కృతిక కార్యక్రమాన్ని అందరినీ ఆకట్టుకుంది. ఇస్కాన్ కేంద్రమంతా నరసింహ స్వామి, హరినామ భజనలు, సంకీర్తనలతో కోలాహలంగా సాగింది. పిల్లలు నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. అనంతరం మహా అన్నప్రసాద వితరణ నిర్వహించడం జరిగింది. ప్రతి సంవత్సరం వలే సంవత్సరం కూడా పిల్లలకు ఇస్కాన్ సంస్థచే సమ్మర్ క్యాంప్ నిర్వహిస్తూ శ్రీమద్ భాగవతాన్ని తెలియజేస్తున్నారు. నేటి ఆధునిక దైనందిన జీవితంలో పిల్లలకు భారతదేశ సంస్కృతి సాంప్రదాయాల గురించి తెలియపరచడానికి ఈ సమ్మర్ క్యాంప్ ఎంతో ఉపలబ్ధిగా ఉంటుందని అలాగే కొందరు ఆన్లైన్ ద్వారా ఈ కార్యక్రమంలో పాలు పంచుకుంటున్నారని నిర్వాహకులు తెలిపారు. ఇస్కాన్ కేంద్రంలో ప్రతి పండుగను చక్కగా నిర్వహించడం జరుగుతుందని ఇందుకు చాలామంది భక్తులు మాకు సహకరిస్తున్నారని, నేటి ఈ మహాభిషేక కార్యక్రమంలో ఉషోదయ విద్యాసంస్థల నిర్వాహకులు సూర్యప్రకాష్ దంపతులు పాల్గొనగా మిగతా భక్తులు కూడా కార్యక్రమానికి విచ్చేసి ఇట్టి కార్యక్రమంలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారని అన్నారు. ఇట్టి కార్యక్రమంలో ఇస్కాన్ కేంద్ర సంస్థ నిర్వాహక ప్రతినిధులు రత్నమై రాధికా దేవి దాసి, అశోకాత్మ నిథైదాస్, కేశవ కరుణానిధి దాస్, యాదవ గోవిందా దాస్, నర్సింలు దాస్, గోవిందా దాస్, శివరామరెడ్డి దాస్, హనుమాన్ కీర్తన్ దాస్, మహాత్మా నిథైదాస్ తదితర ప్రముఖులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# వచ్చే నెల చివరినాటికి రాష్ట్ర వ్యాప్తంగా స్లాట్ బుకింగ్

* **రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి**




హైదరాబాద్ మే 11(సమయం న్యూస్) : హైదరాబాద్: ప్రజల సమయాన్ని ఆదా చేసేందుకు, రిజిస్ట్రేషన్ ప్రక్రియను మరింత వేగవంతం చేసేందుకు స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖలో కీలక సంస్కరణలకు స్వీకారం చుట్టామని రెవిన్యూ హౌసింగ్ సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఆస్తుల రిజిస్ట్రేషన్ కు వచ్చే కొనుగోలుదారులు, అమ్మకందారులు గంటల తరబడి చెట్ల కింద నిరీక్షించవలసిన పరిస్థితిని మార్చుతూ, సబ్ రిజిస్టర్ కార్యాలయాలను ఆధునికీకరించడమే కాక, స్లాట్ బుకింగ్ విధానాన్ని దశలవారీగా అమలులోకి తీసుకొస్తున్నామని ఆదివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో వెల్లడించారు. ఇప్పటికే గత నెల పదవ తేదీ నుంచి ప్రయోగాత్మకంగా 22 సబ్ రిజిస్టర్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ అమలు చేశామని అక్కడ విజయవంతం కావడంతో ఈ నెల 12వ తేదీ నుంచి మరో 25 సబ్ రిజిస్టర్ కార్యాలయాల్లో అమలు చేయబోతున్నామని ప్రకటించారు. వచ్చే నెల చివరినాటికి రాష్ట్రంలోని 144 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఈ విధానాన్ని అమల్లోకి తీసుకురావడానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రజలకు వేగవంతమైన, సమర్థమైన సేవలందించడమే లక్ష్యంగా సంస్కరణలు తీసుకురావడమే కాకుండా వాటిని అమలు చేయవలసిన బాధ్యత అధికారులదే స్పష్టం చేశారు. పని ఒత్తిడి ఎక్కువగా ఉన్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ విధానాన్ని సులభతరం చేయడానికి మరియు 48 స్లాట్స్ కన్నా ఎక్కువ స్లాట్స్ అవసరం ఉన్న కార్యాలయాలలో ఇప్పుడున్న సబ్ రిజిస్ట్రార్లకు తోడుగా అదనపు సబ్ రిజిస్ట్రార్లను నియమిస్తామని, ఇప్పటికే ప్రయోగాత్మకంగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని కుత్బుల్లాపూర్ కార్యాలయంలో అదనంగా ఇద్దరు సబ్ రిజిస్ట్రార్లు మరియు సిబ్బందిని నియమించడం జరిగిందని తెలియజేస్తూ విజయవంతమైన ఈ విధానాన్ని ఉప్పల్, మహేశ్వరం మరియు మంచిర్యాల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలలో ప్రవేశపెడుతూ అదనంగా ఒక్కొక్క సబ్ రిజిస్ట్రార్ ని నియమించడం జరుగుతుంది అని తెలియజేశారు. స్లాట్ బుకింగ్ విధానాన్ని దృష్టిలో పెట్టుకొని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను పునర్వ్యస్తికరణ చేస్తున్నామని, ఇందులో భాగంగా అధిక రద్దీ, తక్కువ రద్దీ ఉన్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిని విలీనం చేసి పనిభారాన్ని సమానం చేయడానికి చర్యలు తీసు కోవడం జరిగిందని, ఇందులో భాగంగా ఇప్పటికే రంగారెడ్డి జిల్లాలోని చంపాపేట మరియు సరూర్ నగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల అధికార పరిధి విలీనం విజయవంతం కావడంతో షాద్ నగర్ మరియు ఫారూక్ నగర్ సిద్దిపేట మరియు సిద్దిపేట (రూరల్) విలీనం చేయడం జరిగిందన్నారు.

* **రేపటి నుంచి స్లాట్ బుకింగ్ అమలు కానున్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు :**

హైదరాబాద్ ఆర్.ఓ. ఆఫీసు, హైదరాబాద్ ఆర్.ఓ. ఆఫీసు సౌత్ , నారపల్లి, ఘట్కేసర్, మల్కాజిగిరి, ఉప్పల్, కాప్రా, బీబీనగర్, సిద్దిపేట్, సిద్దిపేట్ రూరల్, గజ్వేల్, మంచిర్యాల, పెద్దపల్లి, వరంగల్ ఆర్.ఓ. ఆఫీసు, జనగాం, ఘన్పూర్, నర్సంపేట, కల్వకుర్తి, నారాయణపేట, మహేశ్వరం, రంగారెడ్డి ఆర్.ఓ. ఆఫీసు, షాద్ నగర్, ఫరూక్ నగర్ , వనస్థలిపురం, శేరిలింగంపల్లి.



## క్రీడా స్ఫూర్తి నీ పెంపొందించాలి

* **అడిషనల్ కమిషనర్ యాదగిరి రావు**

హైదరాబాద్ మే 11:(సమయం న్యూస్) : జి హెచ్ ఎం సి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మర్ కోచింగ్ క్యాంపులో శిక్షణ పొందుతున్న పిల్లలకు క్రీడా స్ఫూర్తి పెంపొందించాలని స్పోర్ట్స్ అడిషనల్ కమీషనర్ యాదగిరి రావు అన్నాడు. ఆదివారం సమ్మర్ కోచింగ్ సందర్భంగా సికింద్రాబాద్, శేరిలింగంపల్లి మరియు కూకట్‌పల్లి జోన్‌ల పార్ట్ టైమ్ కోచ్‌లు మరియు గౌరవ కోచ్‌లతో పాటు సంబంధిత గేమ్స్ ఇన్‌స్పెక్టర్లతో సమీక్షా సమావేశం నిర్వహించి, కోచ్‌ల వారీగా పనితీరును సమీక్షించి, సభ్యత్వ ఆదాయాన్ని మెరుగుపరచాలని ఆదేశించారు. పిజెఆర్ స్టేడియంలో ఇందిరా పార్క్‌లో రోలర్ స్కేటింగ్ పార్ట్ టైమ్ కోచ్‌గా ఉత్తమ ప్రదర్శన ఇచ్చిన శ్రీ నూర్ మొహమ్మద్ & కరాటే గౌరవ కోచ్ శ్రీ లక్ష్మణ్‌లతో పాటుగా విజేతలు మిస్ శ్రావణ పూజితలను అభినందించారు. జి హెచ్ ఎం సి పరిధిలో ఏర్పాటు చేసిన కోచింగ్ క్యాంపులను ఉపయోగించుకునేలా పిల్లలను ప్రోత్సహించలన్నారు. ఈ వేసవి సెలవుల్లో విద్యార్థులకు ఒక చక్కని అవకాశం మాని వారు కొత్త విషయాలు నేర్చుకోవడమే కాకుండా, తమలోని దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయడానికి కూడా ఈ శిబిరాలు సహాయపడతాయని అడిషనల్ కమీషనర్ పేర్కొన్నారు.

# ఆ అంశంలో అనుమానాల నివృత్తికి రెఢీ..

## మంత్రి పొన్నం హాట్ కామెంట్స్



ప్రధాని నరేంద్ర మోడీ వద్ద టైం ఇప్పిస్తారా?, కుల గణనపై అనుమానాల నివృత్తికి సిద్ధంగా ఉన్నామని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో బీసీ కమిషన్ వేసుకొని, బుసాని వెంకటేశ్వర రావుతో డెడికేటెడ్ కమిషన్ వేసుకొని, లక్ష మంది ప్రభుత్వ ఉద్యోగులతో పారదర్శకంగా సర్వే నిర్వహించామని తెలిపారు. మహారాష్ట్రలో బీసీ కుల గణన చేస్తామని అసెంబ్లీలో తీర్మానం చేయగానే మహారాష్ట్ర ప్రభుత్వాన్ని కూల్చారని, బీహార్ లో కుల గణన చేపట్టి ఆ నివేదిక అసెంబ్లీలో ప్రవేశపెట్టక ముందే ఆర్జేడీ, జేడీయూ ప్రభుత్వాన్ని బీజేపీ కూల్చేసిందని ఆరోపించారు. జార్ఖండ్లో బీసీల రిజర్వేషన్లు పెంచుతామని అసెంబ్లీలో తీర్మానం పెట్టగానే తప్పుడు కేసులతో ఆ రాష్ట్ర సీఎం హేమంత్ సోరెన్ ను జైల్లో వేశారని, అటువంటి చరిత్ర బీజేపీ కేంద్ర ప్రభుత్వానిదని తీవ్ర ఆరోపణలు చేశారు. రాష్ట్రాల నుంచి కేంద్రం వరకు రాజకీయ విద్యా ఉద్యోగాల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించింది కాంగ్రెస్ పార్టీ అని కొనియాడారు. బీజేపీ అధ్యక్ష పదవి, శాసన సభలో బీజేపీ ప్రతిపక్ష నాయకుడి పదవి, మండలిలో పక్ష నాయకుడి పదవులకు బీసీలు పనికిరారా? అని నిలదీశారు. అన్ని అత్యున్నత పదవులు వేరే సామాజిక వర్గానికి కేటాయించిన బీసీలపై మొసలి కన్నీరు కారిస్తే సమాజం అంగీకరిస్తుందా? అని ప్రశ్నించారు. చేతనైతే బీసీలకు ప్రయోజనాలు కల్పించాలి అంతేతప్ప.. ఒక సాహసోపేతమైన నిర్ణయాన్ని అమలు చేసే ప్రయత్నం చేస్తున్న తెలంగాణ ప్రభుత్వ కృషికి గండి కొట్టొద్దన్నారు. బీసీ లకు 42 శాతం రిజర్వేషన్లు పెంచుతూ చేసిన బిల్లును ఆమోదింపజేసి బీసీలపై ఉన్న చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు. బీసీ కేంద్ర విద్యా సంస్థలైన ఐఐటీ, ఐఐఎం లాంటి వాటిలో కూడా బీసీలకు రిజర్వేషన్లు కల్పించిన చరిత్ర కాంగ్రెస్ ప్రభుత్వలదని గుర్తుకు చేశారు. బీసీల విషయంలో కాంగ్రెస్ పార్టీ పై బీజేపీ నేత లక్ష్మణ్ చేసిన వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కుల గణన కు వ్యతిరేకంగా సుప్రీం కోర్టుకు వెళ్లి అఫిడవిట్ సమర్పించిన చరిత్ర బీజేపీదన్నారు. మండల్ కమిషన్ వస్తే కమండలం తీసుకొచ్చింది బీజేపీ.. బీజేపీ అగ్రవర్ణాల ఫ్యూడలిస్ట్ పార్టీ అని విమర్శించారు. కులగణన చేసి బీసీలకు రాజకీయ విద్యా ఉద్యోగాల్లో 42 శాతం రిజర్వేషన్లు పెంచి చేసిన చట్టం తెలంగాణ దేశానికి రోల్ మోడల్ గా నిలుస్తోందన్నారు. తెలంగాణను చూసే తప్పని పరిస్థితుల్లో కేంద్రంలో జన గణనతో పాటు కులగణన చేస్తామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించిందన్నారు. తెలంగాణలో చేసిన కుల గణన చూసి దేశవ్యాప్తంగా చేస్తున్నారని, ఇక్కడ చేసిన కుల సర్వే ఆధారంగా పెంచిన 42 శాతం బీసీ రిజర్వేషన్లను పెంచుతూ చేసిన చట్టాన్ని రాష్ట్ర బీజేపీ నేతలు ఆమోదించి, బీసీలకు న్యాయం చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు. బీసీ ల విషయంలో కాంగ్రెస్ పార్టీ పై బీజేపీ నేత లక్ష్మణ్ చేసిన వ్యాఖ్యలు వెంటనే వెనక్కి తీసుకోవాలని సూచించారు.

## తెలంగాణ భవన్‌కు భారీగా చేరుతున్న తెలంగాణ వాసులు.. మరో వంద మంది వచ్చే ఛాన్స్

భారత్ , పాక్‌యుద్ధం ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో సరిహద్దు రాష్ట్రాల నుంచి తెలంగాణకు చెందిన విద్యార్థులు, పౌరులు పెద్ద సంఖ్యలో న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్‌కు చేరుకుంటున్నారు. ఇప్పటి వరకు 86 మంది తెలంగాణవాసులు ఢిల్లీ తెలంగాణ భవన్‌కు చేరుకోగా, వారిలో 26 మందిని రాష్ట్రానికి వెళ్ళేందుకు అవసరమైన రవాణా సౌకర్యాలు కల్పించి స్వగ్రామాలకు పంపించారు. ఇంకా దాదాపు 100 మందికిపైగా తెలంగాణ భవన్‌కు చేరుకునే అవకాశం ఉందన్న సమాచారం మేరకు అధికారులు ముందస్తుగా అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ నేపథ్యంలో తెలంగాణ భవన్‌లో ఏర్పాట్లను




రెసిడెంట్ కమిషనర్ డా. గౌరవ్ ఉప్పల్ ఆదివారం నాడు స్వయంగా సమీక్షించారు. తెలంగాణభవన్ సిబ్బందితో కలిసి భోజన వసతి, వైద్య, రవాణా తదితర ఏర్పాట్లను పరిశీలిస్తూ తగిన సూచనలు చేశారు. ఈ సమయంలో తెలంగాణ భవన్‌కు చేరుకున్న ప్రతి ఒక్కరికి ప్రభుత్వం అన్ని విధాల సహాయాన్ని అందిచనుందని డాక్టర్‌గౌరవ్ ఉప్పల్ తెలిపారు.

# హైడ్రాపై ఎంపీ ఈటెల వ్యాఖ్యలు దురదృష్టకరం..

## హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్

హైడ్రాపై బీజేపీ ఎంపీ ఈటెల చేసిన వ్యాఖ్యల పట్ల హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ స్పందించారు. ఈ సందర్భంగా ఈటెల వ్యాఖ్యలపై రంగనాథ్ క్లారిటీ ఇచ్చారు. ఈ మేరకు ఆయన ఓ ప్రకటన ద్వారా స్పందిస్తూ..ఎంపీ ఈటెల వ్యాఖ్యలు దురదృష్టకరమని, పేదలు, సామాన్యులను హైడ్రా ఇబ్బంది పెట్టదని చెప్పారు. ఈ సందర్భంగా రంగనాథ్.. బాచుపల్లి ఎమ్మార్వో ఇచ్చిన నోటీసులతో హైడ్రాకు సంబంధం లేదని, అసలు ఈ విషయం గురించి కూడా తనకు కానీ హైడ్రా అధికారులకు గానీ తెలియదని ఆయన స్పష్టం చేసారు. అలాగే ఇదే విషయాన్ని మేడ్చల్ మల్కాజగిరి కలెక్టర్ తో కూడా మాట్లాడానని, ఆ నోటీసులు ఎందుకు ఇచ్చారో ఎమ్మార్వోను ఆరా కలెక్టర్ ని కోరినట్టు తెలిపారు. అంతేగాక ప్రతీ నోటీస్ ను, ప్రతీ కూల్చివేతను హైడ్రాకు ఆపాదించి ప్రజల్ని ఆందోళనకు భయ భ్రాంతులకు గురి చేయడం దురదృష్టకరమని, బడా భూకబ్జా దారుల మీద హైడ్రా కటినంగా వుంటూ సామాన్యులకు అండగా వుంటుందని తెలిపారు. కలెక్టర్ కి కూడా తెలియకుండానే ఎమ్మార్వో నోటీసులు ఇచ్చారని మల్కాజిరి ఎంపీ ఈటల రాజేందర్ ఒకవైపు చెబుతూనే.. ఎంతో నిబద్ధతో పని చేస్తున్న హైడ్రాను దోషిగా నిలబెట్టాలని



చేస్తున్న ప్రయత్నాలు దురదృష్టకరమని అన్నారు. ఈటల రాజేందర్ మాటలు ప్రజలను తప్పుదోవ పట్టించేవిగానూ, అయోమయానికి గురిచేసేవిగా ఉన్నాయని తెలిపారు. హైడ్రా పనితీరుపై ప్రజల్లో స్పష్టమైన అవగాహన ఉన్న తరుణంలో ఈటల రాజేందర్ లాంటి వారు హైడ్రాపై ఆరోపణలు చేస్తూ ప్రజలను అయోమయానికి గురి చేయడం సబబు కాదని సూచించారు. ఇక సచివాలయంలో ఈటల కలిసినప్పుడు కూడా హైడ్రా కార్యకలాపాలపై చర్చ వస్తే స్పష్టంగా వివరించానని, జూలై, 2024 కంటే ముందు కట్టిన నివాసాల జోలికి హైడ్రా వెళ్ళదని స్పష్టం చేసానని తెలిపారు. అనుమతులు తీసుకున్న వాణిజ్య సముదాయాలను కూడా హైడ్రా తొలగించదని, పేదలు, సామాన్యులకు హైడ్రా ఇబ్బంది పెట్టదని చెప్పారు. హైడ్రా పని తీరుపైన ప్రజలు ఎంతో స్పష్టతతో ఉన్నారని... అనవసరమైన ఆరోపణలు చేసి అయోమయానికి గురి చేయవద్దని హైడ్రా కమిషనర్ కోరారు.

## కామ్రేడ్ పడాల రాములు...
# పోరాటాల స్ఫూర్తిని ముందుకు తీసుకెళ్లే బాధ్యత మనదే

: బి. మల్లేష్

బోధన్ పట్టణం, మే 11, సమయం న్యూస్ : సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ (ప్రజాపంథా) బోధన్ డివిజన్ ఆధ్వర్యంలో ఘనంగా ఆదివారం నాడు కామ్రేడ్ పడాల రాములు 22వ వర్ధంతి ఘనంగా నిర్వహించబడింది. బోధన్ పట్టణంలోని పానుగల్లిలో జరిగిన కార్యక్రమంలో పార్టీ నేతలు, ప్రజా సంఘాలు పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా డివిజన్ సహాయ కార్యదర్శి బి. మల్లేష్ మాట్లాడుతూ, "కామ్రేడ్ పడాల రాములు చేసిన ప్రజాపోరాటాలు ఈ నేటి తరం



కొనసాగించాల్సిన అవసరం ఉంది. ఆయన సేవలే మనకు మార్గదర్శకం," అన్నారు. 2003లో గుండెజబ్బుతో ఆయన అకాల మరణం చెందగా, ఆయన మరణం కుటుంబానికే కాకుండా ఈ ప్రాంత ప్రజలకు తీరని లోటుగా మిగిలిందని తెలిపారు. కూలీ రేట్ల పెంపు, నిజాంసాగర్ నీటి కోసం, ఎన్ ఎస్ ఎఫ్ భూముల పరిరక్షణ వంటి అనేక ఉద్యమాల్లో రాములు సజీవ పాత్ర పోషించారని మల్లేష్ గుర్తుచేశారు. రైతు కూలీ సంఘంలో ఉన్నప్పటికీ, విద్యార్థులు, యువజనులు, కార్మికులు, మహిళలకు ఆయన మద్దతుగా నిలిచారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి పడాల శంకర్, బొంతల సాయిలు, ఎస్. బాలయ్య, జీ. పార్వతి, పోశెట్టి, రాములు, సుమన్, హరి తదితరులు పాల్గొన్నారు.



## జాగిలాలతో గజ్వేల్ లో
# నార్కోటిక్ డ్రగ్స్ తనిఖీలు

గజ్వేల్, మే11 : గజ్వేల్ పట్టణంలో ఆదివారం నార్కోటిక్ డాగ్స్ తో పోలీసులు మత్తు పదార్థాల కోసం విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. బస్టాండ్, ఇంటిగ్రేటెడ్ మార్కెట్, హనుమాన్ టెంపుల్ రోడ్, శివారు ప్రాంతంలో నార్కోటిక్ డాగ్స్ తో విస్తృతంగా తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా గజ్వేల్ అడిషనల్ ఇన్స్పెక్టర్ ముత్యం రాజు మాట్లాడుతూ పోలీస్ కమిషనర్ అనురాధ ఆదేశాల మేరకు అనుమానాస్పద ప్రదేశాలలో డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాల గురించి నార్కోటిక్ డాగ్స్ తో తనిఖీలు నిర్వహించామన్నారు. గంజాయి ఇతర మత్తు పదార్థాలు, మత్తు పదార్థాలు కలిపిన చాక్లెట్స్ ఎవరైనా కలిగి ఉన్నా, అక్రమంగా రవాణా చేసినా, పాన్ షాపులలో కానీ ఇతర షాపులలో అమ్మినా చట్ట ప్రకారం కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. గంజాయి ఇతర మత్తుపదార్థాల బారిన పడకుండా తల్లిదండ్రులు పిల్లలను ఒక కంటితో కనిపెడుతూ ఉండాలన్నారు. గంజాయి ఇతర మత్తుపదార్థాలు ఎవరైనా కలిగి ఉంటే అమ్మిన విక్రయించిన వెంటనే 100 ఫోన్ నెంబర్కు గాని, గజ్వేల్ పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఈ తనిఖీలలో గజ్వేల్ ఎస్ఐ ఉమా రెడ్డి, పోలీస్ సిబ్బంది డాగ్ స్క్వాడ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అర్ధరాత్రి టేకు కలప స్మగ్లింగ్..!

* **దర్జాగా కోతలు సైజులుగా తరలింపు**
* **గతంలో ఇదే దందా మాఫియాకు కాసులు**
* **అయినా గట్టి చర్యలు శూన్యం**
* **చెట్లకు రక్షణగా సీసీ కెమెరాలు ఏర్పాటుకు డిమాండ్**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, మే 11 (సమయం న్యూస్): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రామవరం గోధుమ వాగు బ్రిడ్జి పక్కన గతంలో సింగరేణి మ్యాగ్జిన్ ఖాళీ స్థలంలో ఉన్న టేకు చెట్లు నరికివేతకు గురవుతూ మాయమైతున్నాయి. పెద్ద పెద్ద టేకు చెట్లను కొంతమంది మాయగాళ్లు మిషన్లతో కోసి అర్ధరాత్రి ఎడ్లబండ్ల ద్వారా తరలిస్తున్న పరిస్థితి నెలకొంది. గతంలో కూడా అధిక మొత్తంలో చెట్లు నరికివేతకు గురవుతే కొందరు సంబంధిత ఫారెస్ట్ అధికారులకు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. అయితే మున్సిపల్ అధికారులు స్పందించి కందకాలు తవ్వించినప్పటికీ కలప చెట్లు మాత్రం ఇప్పటికీ నరికివేతకు గురవుతూనే ఉన్నాయి. తాజాగా రెండు రోజుల కిందట కొన్ని చెట్లు నరికివేతకు





గురైన సమాచారం బయటకు రావడంతో స్మగ్లర్స్ అప్రమత్తమై కోసి వేసిన కల్పన మొద్దులను తరలించకపోయి మిగతా చెట్టు కొమ్మలను వదిలి వెళ్ళినట్లు ఆనవాళ్లు కనిపిస్తున్నాయి. లక్షల రూపాయల విలువచేసే కలప దొడ్డిదారిన దారుణంగా తరలిపోతున్నప్పటికీ ఫారెస్ట్ డిపార్ట్మెంట్ చర్యలు తీసుకోకపోవడంలో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయని ఫిర్యాదుదారులు బహిరంగంగా విమర్శిస్తున్న పరిస్థితి నెలకొంది. ఇదిలా ఉండగా ఇదే ప్రాంతంలో స్మశాన వాటిక సైతం ఉండగా అందులో ఉన్న టేకు చెట్లు సైతం నరికివేతకు గురి కావడం కలవరపెడుతుంది. టేకు కలప మాయమయ్యే విషయంలో ఒకరిద్దరూ మాజీ ప్రజాప్రతినిధుల హస్తం ఉన్నట్లు ప్రచారం జోరుగా సాగుతుంది. సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి. లక్షల విలువ చేసే కలప చెట్లు నరికివేతకు గురికాకుండా ఉండాలంటే తక్షణమే ఆ ప్రాంతంలో సీసీ కెమెరాలు ఏర్పాటుకు మున్సిపల్ శాఖ చర్యలు తీసుకోవాలని పర్యావరణ పరిరక్షణ ప్రియులు డిమాండ్ చేస్తున్నారు. నీడనిచ్చే చెట్లు స్మగ్లర్స్ ఇష్టారాజ్యంగా నరికివేతకు పాల్పడుతుంటే సరైన చర్యలు ఎందుకు తీసుకోలేకపోతున్నారని ఆయా శాఖ అధికారులను పలువురు సూటిగా ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి టేకు కలప తరలిపోకుండా ఉండేందుకు చర్యలు తీసుకోవడంతో పాటు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## ఎఫ్సెట్ ఫార్మసీ అగ్రికల్చర్ విభాగంలో మెరిసిన జిన్నారం గురుకుల విద్యార్థి

* **అభినందించిన కళాశాల ప్రిన్సిపల్**

జిన్నారం, మే 11,సమయం న్యూస్ : సంగారెడ్డి జిల్లా మండల కేంద్రమైన జిన్నారంలోని తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయం, కళాశాలలో బైపిసి చదివిన నంసావత్ మహేష్ అనే విద్యార్థి ఎఫ్ సెట్ ఫలితాలలో 67.82 మార్కులతో 8518 వ ర్యాంక్ సాధించాడని కళాశాల ప్రిన్సిపల్ వెంకటనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ప్రకటించిన ఫలితాలలో కళాశాలకు చెందిన పదిమంది విద్యార్థులు ఫార్మసీ అండ్ అగ్రికల్చర్ విభాగంలో అర్హత



సాధించారని ఆయన పేర్కొన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించిన నంసావత్ మహేష్ ను, విద్యార్థులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ తోపాటు సిబ్బంది పాల్గొన్నారు.

## బిడ్డలకు జన్మనిచ్చి భరతమాతను
# కాపాడే ఓ తల్లి నీకు ఇదే మా వందనాలు

* **ఉన్నందాస్ గడ్డలో ఘనంగా మాతృ దినోత్సవం**

భద్రా కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, మే 11(సమయం న్యూస్) : బిడ్డలకు జన్మనిచ్చి భరతమాత ఒడిలో ఉన్న బిడ్డలను పహల్గామ ఉగ్ర దాడిలో శత్రుదేశం నుండి కాపాడేందుకు వీరులను పంపిన ప్రతి తల్లికి ఇదే మా పాదాంజలి ఆపరేషన్ సింధూర్ బాధ్యతలో ఉన్న వీరవనితలు మహిళా కమాండర్ సోఫియా కురేషి, వింగ్ కమాండర్ వ్యోమిక సింగ్ భరతమాత సింధూరం మహాశక్తిని చూపించిన మీకు ఇవే మా వందనాలు అంటూ ఉన్నదాసు గడ్డలో మాజీ కౌన్సిలర్లు మునిగడప పద్మ వెంకటేశ్వర్ల ఆధ్వర్యంలో మాతృ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు



. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తల్లి లేనిదే మనకు జన్మ లేదని ఆ తల్లి నవ మాసాలు మోసి ఎన్నో బాధలకు ఓర్చుకొని జన్మనిచ్చిన బిడ్డలను మంచి బాటలో నడిపించాలని వారి ఎదుగుదలే తన సంతోషమని జీవిస్తుందని అన్నారు. ఆ తల్లికి మనం ఎంతో రుణపడి ఉండాలని నేటి ఆధునిక సమాజంలో తల్లిదండ్రులను చూడనటువంటి కొంత దుర్మార్గ వ్యవస్థ ఉన్నదని అలాంటి వ్యవస్థను ఈ మదర్స్ డే నుండైనా మార్చాలని అన్నారు. తల్లులను గౌరవించాల్సిన బాధ్యత ప్రతి పౌరుల్లో ఉంటుందని పేర్కొన్నారు. భరతమాతను కాపాడే పదో వార్డుకు చెందిన తెలగరి అభిలాష్, బానోత్ గౌతమ్ బిడ్డలను కన్న తేలగరి మాణిక్యమని, బానోతు సుశీల తల్లులు మన ఇండియన్ ఆర్మీకి అందించి నేటి యుద్ధంలో భాగస్వాములను చేసిన వారిని శాలువాతో ఘనంగా సత్కరించారు. అలాగే ఉన్నందాస్ గడ్డ వృద్ధాప్య తల్లులను శాలువాతో సత్కరించి కేక్ కట్ చేసి అందరికీ మాతృ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో శాఖ కార్యదర్శి సూరి మేని జనార్ధన్, ఎస్కే జలీల్, బానోతు చందర్, సిపిఐ సీనియర్ నాయకులు కట్ట సత్యనారాయణ, అస్మత్ పాషా, షణ్ముఖ చారి, రమేష్, మునిగడప స్వరాజ్యం, ముద్దం మార్తమ్మ, బానోతు కమల, సత్యవతి, తెలగరి సౌజన్య ,పద్మక్క, శ్రీదేవి, కవిత తదితరులు పాల్గొన్నారు.



## పహల్గాం బాధిత ఆడపడుచులకు ప్రతీక ఆపరేషన్ సింధూర్

* **గుమ్మడిదల మండల బిజెపి అధ్యక్షుడు ఐలేష్**

గుమ్మడిదల,మే11, సమయం న్యూస్ : పహల్గాం ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన 26 మంది కుటుంబీకుల ఐదవతనానికి నిదర్శనానికి 'ఆపరేషన్ సింధూర్' అని గుమ్మడిదల మండల బిజెపి పార్టీ అధ్యక్షులు కావలి ఐలేష్ అన్నారు. ఆదివారం బొంతపల్లి లోని శ్రీ భ్రమరాంబిక సమేత మల్లికార్జున స్వామి ఆలయాన్ని సందర్శించి, దేశ సంరక్షణ కోసం నిరంతరం కృషి చేస్తున్న నరేంద్ర మోడీతో పాటు దేశ రక్షణ కోసం ప్రాణాలను సైతం త్యాగం చేస్తూ, ఆపరేషన్ సింధూరం విజయవంతం చేరిన సైనికులకు మనోధైర్యంతో పాటు ఆశీస్సులు ఉండాలని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర సీనియర్ నాయకులు అందూర్ నర్సింగ్ రావు హాజరై పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పహల్గాం దాడి జరిగిన వారం రోజులలోనే ఆపరేషన్ సింధూర్ కార్యక్రమం నిర్వహించి, తొమ్మిది ఉగ్రవాద స్థావరాలపై దాడి చేసి భారతదేశ సత్తా చాటారని, మోడీ ప్రభుత్వంతోపాటు భారత సైనికులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఉగ్రవాద స్థావరాలపై మెరుపు దాడి చేసి వందలాదిమంది ఉగ్రవాదులను హతమార్చిన త్రివిధ దళాధిపతులకు సైనికులకు వందనాలు అంటూ కొనియాడారు. ఈ కార్యక్రమంలో బూత్ అధ్యక్షులు, మాజీ మండల ప్రధాన కార్యదర్శి ,మహిళా కార్యకర్తలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# వైద్యుల పర్యవేక్షణలో మాత్రమే మాత్రలు వాడాలి

* **బిగ్ టీవీ ఆధ్వర్యంలో గుడికందుల లో ఉచిత వైద్య శిబిరం**

తొగుట. మే 11 (సమయం న్యూస్) : ప్రతి ఒక్కరూ పౌష్టికమైన ఆహారం తీసుకొని తమ ఆరోగ్యాలను కాపాడుకోవాలని వైద్యులు సూచించారు. తొగుట మండలం గుడికందుల గ్రామంలో బిగ్ టీవీ వారి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయడం జరిగింది గ్రామంలో పలు దీర్ఘకాలిక రోగాలతో బాధపడుతున్న వారికి రక్త పరీక్షలు, బిపి, షుగర్ పరీక్షలు, కంటి పరీక్షలు దంత పరీక్షలు, ఎక్స్ రే మరియు ఇ.సీ.జీ పరీక్షలు చేసి వారికున్న పలు రోగ సమస్యలను గుర్తించి మందులను అందించడం జరిగింది. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ... బిగ్ టీవీ ఆధ్వర్యంలో ఉచిత శిబిరాన్ని ఏర్పాటు చేసి ప్రజలకు ఉచితంగా వైద్యం






అందించడం గొప్ప విషయం అని మరిన్ని ఉచిత వైద్య సేవలు అందించాలని మేము కోరుకుంటున్నాము అని తెలిపారు. పిఎసిఎస్ చైర్మన్ హరికృష్ణ రెడ్డి మాట్లాడుతూ.బిగ్ టీవీ వారు మా గ్రామంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం చాలా సంతోషకరమని అన్నారు. అత్యాధునిక కాలంలో ప్రజలు ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేసుకోవద్దు అని తెలిపారు. ఈ ఉచిత క్యాంపుకు గ్రామంలోని ప్రతి ఒక్కరు హాజరై వైద్య పరీక్షలు చేసుకున్నారని హరికృష్ణ రెడ్డి తెలిపారు. కార్యక్రమం లో ఆత్మకమిటీ డైరెక్టర్ దూలం బైరా గౌడ్, బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి విభీషణ్ రెడ్డి .వైద్య బృందం సిబ్బంది, తాజా మాజీ సర్పంచ్ గంగనీగళ్ళ మల్లయ్య, మాజీ సర్పంచ్ రమేష్ గౌడ్, మాజీ ఉప సర్పంచ్ మల్లుగారి శ్రీకాంత్ రెడ్డి, భాస్కర్, మరియు గ్రామ ప్రజలు సిబ్బంది పాల్గొన్నారు.

epaper.samayamdaily.net APTEL/2006/18267
సమయం
www.samayamdaily.net



# మే 13 నాటికి అన్ని జట్ల ఆటగాళ్లు రెడీగా ఉండాలి..
## ఫ్రాంఛైజీలతో బీసీసీఐ!

కాల్పుల విరమణ అంగీకారంతో భారత్, పాక్ మధ్య ఉద్రిక్తతలకు ప్రస్తుతానికి తెరపడింది. దీంతో ఐపీఎల్ 2025ను పునః ప్రారంభించే దిశగా బీసీసీఐ ప్రయత్నాలు మొదలుపెట్టింది. మంగళవారం (మే 13) లోగా పంజాబ్ కింగ్స్ మినహా అన్ని ఐపీఎల్ జట్ల ఆటగాళ్లు తమ వేదికల్లో (హోం గ్రౌండ్‌లు) అందుబాటులో ఉండేలా చూసుకోవాలని ఫ్రాంఛైజీలకు సూచించినట్లు తెలుస్తోంది. త్వరలో కొత్త షెడ్యూల్‌ను రూపొందించి ఐపీఎల్‌ను తిరిగి ప్రారంభించే ఆలోచనలో ఉన్నామని ఫ్రాంఛైజీలకు బీసీసీఐ మౌఖికంగా తెలియజేసినట్లు సమాచారం. తమ విదేశీ ఆటగాళ్ల ప్రయాణ ప్రణాళికలను తెలియజేయాలని కోరినట్లు తెలుస్తోంది. దీంతో ఫ్రాంఛైజీలు తమ విదేశీ ప్లేయర్లను వెనక్కి రప్పించడానికి ఏర్పాట్లు చేస్తున్నాయి. మే 13 వరకు అన్ని జట్ల ఆటగాళ్లు అందుబాటులోకి వస్తే ముందుగా నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం మే 25నే ఐపీఎల్ ముగించాలని బీసీసీఐ భావిస్తోందట. మిగిలిన 12 లీగ్



మ్యాచ్‌లను డబుల్ హెడర్‌లతో త్వరగా ముగించాలని ప్లాన్ చేస్తోందని సమాచారం. పంజాబ్ కింగ్స్‌కు తటస్థ వేదిక కేటాయిస్తారని భోగట్టా. అయితే, ఆ వేదికను ఇంకా ఖరారు చేయలేదని తెలుస్తోంది. భారత ప్రభుత్వం నుంచి ఆమోదం లభిస్తే మే 15 లేదా 16న ఐపీఎల్ 2025 సీజన్ పున: ప్రారంభమయ్యే ఛాన్స్ ఉంది. ఈ మేరకు బీసీసీఐ వర్గాలను ఉటంకిస్తూ జాతీయ మీడియాలో వార్తలొస్తున్నాయి.

# మహిళల ముక్కోణపు వన్డే సిరీస్.. విజేతగా భారత్

కొలంబో: దక్షిణాఫ్రికా, శ్రీలంక, భారత్ మధ్య జరిగిన మహిళల ముక్కోణపు వన్డే సిరీస్‌లో విజేతగా టీమ్ఇండియా నిలిచింది. సిరీస్ ఫైనల్ మ్యాచ్‌లో శ్రీలంకపై భారత్ 97 పరుగుల తేడాతో విజయం సాధించింది. భారత్ నిర్దేశించిన 343 పరుగుల లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన శ్రీలంక 48.2 ఓవర్లలో 245 పరుగులకే ఆలౌటైంది. లంక బ్యాటర్లలో చమరి ఆటపట్టు (51) అర్ధశతకం సాధించింది. నీలాక్షి(48), విష్మి(36) రాణించారు. మిగతా బ్యాటర్లు తక్కువ స్కోర్‌కే ఔటయ్యారు. భారత బౌలర్లలో స్నేహ్ రాణా 4, అమన్‌జ్యోత్ 3 వికెట్లు తీశారు. శ్రీచరణి ఒక వికెట్ పడగొట్టింది.



*** స్మృతి సెంచరీ.. భారీ స్కోర్ చేసిన భారత్**

టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న టీమ్ ఇండియా బ్యాటర్లందరూ రాణించడంతో నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 342 పరుగులు చేసింది. ఓపెనర్ స్మృతి మంధాన (116; 101 బంతుల్లో 15 ఫోర్లు, 2 సిక్స్‌లు) శతకంతో ఆకట్టుకుంది. హర్లీన్ డియోల్ (47; 56 బంతుల్లో), కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (41; 30 బంతుల్లో), జెమీమా రోడ్రిగ్స్ (44; 29 బంతుల్లో), ప్రతీకా రావల్ (30) రాణించారు. అమన్‌జ్యోత్ కౌర్ (18), రిచా ఘోష్ (8), దీప్తి శర్మ (20*) పరుగులు చేశారు. శ్రీలంక బౌలర్లలో దేవ్మీ విహంగా 2, సుగందికా కుమారి 2, మదార 2, ఇనోకా రణవీర ఒక వికెట్ పడగొట్టారు.



## మృణాల్ ఠాకూర్‌తో పెళ్లి వార్తలు..
# స్పందించిన సుమంత్

హైదరాబాద్: నటుడు సుమంత్, నటి మృణాల్ ఠాకూర్ వివాహ బంధంలోకి అడుగుపెట్టబోతున్నారంటూ ఇటీవల జోరుగా ప్రచారం జరిగింది. వీరిద్దరూ కలిసి దిగిన ఓ ఫొటో కూడా నెట్టింట వైరల్‌గా మారింది. వీటిపై తాజాగా సుమంత్ స్పష్టతనిచ్చారు. తన తదుపరి చిత్రం 'అనగనగా' ప్రమోషన్స్‌లో భాగంగా పెళ్లి వార్తలపై స్పందించారు. ఆయా వార్తల్లో నిజం లేదని పేర్కొన్నారు.సోషల్‌మీడియాను తాను పెద్దగా ఉపయోగించనని.. అందుకే ఈ వార్తలు తన దృష్టికి రాలేదని సుమంత్ తెలిపారు. నెట్టింట వైరల్‌గా మారిన ఫొటో తాము 'సీతారామం' ప్రమోషన్స్ సమయంలో తీసుకున్నామని వివరించారు. మరో ఇంటర్వ్యూలో ఆయన పెళ్లిపై మాట్లాడుతూ.. వైవాహిక బంధంలోకి మరోసారి అడుగుపెట్టే ఉద్దేశం లేదన్నారు. సుమంత్‌కు గతంలోనే వివాహం జరిగిన విషయం తెలిసిందే. నటి కీర్తి రెడ్డిని పెళ్లి చేసుకున్నారు. కొంతకాలానికే వీరిద్దరూ విడిపోయారు. సుమంత్ హీరోగా నటించిన తాజా చిత్రమే 'అనగనగా'. 'ఈటీవీ విన్' ఒరిజినల్ మూవీగా ఇది విడుదల కానుంది. కాజల్ చౌదరి హీరోయిన్. సన్నీ కుమార్ దర్శకత్వం వహించారు. ఈ సినిమాలో సుమంత్ ఉపాధ్యాయుడిగా నటించారు. నేటి విద్యా వ్యవస్థలోని లోపాలను ఎత్తి చూపడంతోపాటు చిన్నారులకు ఏ విధంగా పాఠాలు బోధిస్తే త్వరగా అర్థమవుతుందో చెప్పే ప్రయత్నం చేసినట్టు కొన్ని రోజుల క్రితం విడుదలైన టీజర్ చూస్తే అర్థమవుతోంది. మార్కుల కోసం పిల్లలపై ఒత్తిడి పెంచకూడదని.. కాన్సెప్ట్ నేర్చుకుంటే చాలు మార్కులు వాటంతటవే వస్తాయనేది ఆ ఉపాధ్యాయుడి నమ్మకం. మరి, ఆయన ప్రయత్నం ఫలించిందా? వీరి కుమారుడు ఎన్ని మార్కులు సంపాదించాడు? తదితర అంశాలతో ఈ సినిమా రూపొందింది.

# సినిమా

## ఆమె చేతిలో ఆరు

డ్రాగన్ సినిమాతో ఓవర్ నైట్ లో స్టార్ హీరోయిన్ గా ఎదిగిన అమ్మడు కయాదు లోహార్. ఈ నాలుగేళ్ల కెరీర్‌లో ఆమె చేసిన సినిమాల కన్నా ఈ ఏడాది కమిటైన ప్రాజెక్టులే ఎక్కువ. డ్రాగన్ తర్వాత కయాద్ సుమారు అరడజను సినిమాలకు సైన్ చేసిందని టాక్. కోలీవుడ్ మాత్రమే కాదు టాలీవుడ్ లోను వరుస సినిమాలను సైన్ పెట్టేసిందీ బ్యూటీ. తెలుగులో శ్రీవిష్ణుతో అల్లూరితో ఎంట్రీ ఇవ్వగా అప్పట్లో ఎవరు పెద్దగా పట్టించుకోలేదు. కానీ డ్రాగన్ క్లిక్ సూపర్ హిట్ కావడంతో ఇప్పుడు హాట్ ఫేవరేట్ హీరోయిన్ అయ్యింది. తమిళంలో ఇప్పటికే 'ఇదయం మురళి' అనే సినిమా చేస్తోన్న భామ శింబు 49 మూవీకి కమిటైంది. జీవీ ప్రకాష్ 'ఇమ్మోర్టల్' లోను ఈ బ్యూటీనే హీరోయిన్ గా నటిస్తోంది. తాజాగా ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్ ను కూడా రిలీజ్ అయ్యింది. మలయాళంలో నివిన్ పౌలీ సరసన తారంలో నటిస్తోంది. తెలుగులో కూడా చాన్సులు క్యూ కడుతున్నాయి. విశ్వక్ సేన్ ఫంకీలో మేడమ్ ఫిక్సైంది. రవితేజ ప్రాజెక్టులో అమ్మడి పేరు పరిశీలనలో ఉన్నట్లు సమాచారం. వీటితో పాటు టాలీవుడ్ హై ఆక్టేన్ మూవీ ప్యారడైజ్ లో నానికి పెయిర్‌గా కయాద్ లోహార్‌ను ఆల్మోస్ట్ ఫిక్స్ చేసేశారు. సౌత్ ను ఇలా ఊపేస్తోంది కయాదు.



# ఎర్ర చీరలో..!

తెల్ల చీరలో ఎన్ని సిగ్గులో... మల్లె పూలలో ఎన్ని పిలుపులో .. పిలుపు పిలుపులో ఎన్ని వలపులో అన్నారో సినీ కవి. ఇప్పుడు ఎర్ర చీరలో ఎన్ని సిగ్గులో అంటోందీ భామ. యూట్యూబ్ వీడియోలు, షార్ట్ ఫిలిమ్స్ తో కెరీర్ స్టార్ చేసిన తెలుగమ్మాయి వైష్ణవి చైతన్య. ఆ తర్వాత కొన్ని వెబ్ సిరీస్ లలోనూ నటించింది. బేబీ సినిమాతో సినీ పరిశ్రమలోకి ఎంట్రీ ఇచ్చిందీ అమ్మడు. ఆ సినిమాతో ఫేమస్ అయిపోయిన ఈ అమ్మడు సోషల్ మీడియాలోనూ యాక్టివ్ గా ఉంటోంది. సిద్ధు జొన్నల గడ్డతో జోడీగా ఇటీవలే ఈ అమ్మడి నటించిన సినిమా జాక్. ఈ సినిమా కాస్తా డిజాస్టర్ కావడంతో అమ్మడు కొత్త చాన్సులు లేక ఇబ్బందులు పడుతోంది. ఇదే సమయంలో ఇన్ స్టా పేజీలో హొయలు పోతూ కొన్ని ఫొటోలనూ షేర్ చేసింది. ఇన్‌స్టాగ్రామ్‌లో రిచ్ రెడ్ చీర ధరించిన అందమైన ఫోటోను షేర్ చేసింది. ఆమె సంప్రదాయ దుస్తులలో అందంగా కనిపిస్తోంది. ఫోటోకు క్యాప్షన్ సింపుల్‌గా ఉన్నప్పటికీ లవ్ ఎమోజీ జోడించడంతో అభిమానులు ఫిదా అవుతున్నారు. లైకులు, కామెంట్లతో తమ అభిమానాన్ని చాటుతున్నారు.





# ప్రేమ మందిరం కట్టేశా

'ముంతాజ్ ప్రేమకు గుర్తుగా తాజ్ మహల్‌ని కట్టారు. కానీ దాన్ని తలదన్నేలా అంతకు మించిన గొప్ప ప్రేమ మందిరం ఇప్పటికే నా మనసులో కట్టేసాను. కానీ దాన్ని నేను భౌతికంగా చూపించలేను కాబట్టి తాజ్ మహల్‌ని మించిన మరో మందిరం కట్టి చూపిస్తాను. అది నాకు ఈ జన్మలో సాధ్యం కాకపోయి నా వచ్చే జన్మలోనైనా తప్పక కడతా' అంటూ తన మనసులోని ప్రేమను స్టార్ హీరోయిన్ త్రిషకు వ్యక్తం చేశాడో అభిమాని. చెన్నై అమ్మడు త్రిష తెలుగు సినిమాల్లో నటించి స్టార్ హీరోయిన్‌గా ఎదిగింది. తెలుగుతో పాటు తమిళ, మలయాళ సినిమాల్లో బ్యాక్ టు బ్యాక్ హిట్స్ అందుకుంటూ దూసుకుపోతున్నత్రిష, ప్రస్తుతం చిరంజీవి సరసన 'విశ్వంభర' అనే చిత్రం చేస్తుంది. సాధారణంగా చెప్పాలంటే సెకండ్ ఇన్నింగ్స్ లో అవకాశాలు రావడం చాలా అరుదు. కాని త్రిష మాత్రం అద్భుతమైన అవకాశాలు అందుకుంటుంది. ఇదిలా ఉంటే ఫేవరెట్ హీరో గాని హీరోయిన్ పై అభిమానులు వారి అభిమానాన్ని నానా రకాలుగా వ్యక్తం చేస్తుంటారు. ఇందులో భాగంగా తాజాగా త్రిషకు ఓ అభిమాని చేసిన ప్రపోజ్ ప్రజంట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

**సమంత రూత్ ప్రభు తన కెరీర్‌లో ఒక పెద్ద అడుగు వేసింది. ఆమె ఇప్పుడు నిర్మాతగా మారింది! ఆమె మొదటి నిర్మాణంలో శుభం అనే తెలుగు హర్రర్-కామెడీ చిత్రం విడుదలైంది. ప్రవీణ్ కాండ్రేగుల దర్శకత్వం వహించిన ఈ చిత్రం ఇటీవలే విడుదలై ప్రేక్షకుల నుండి మంచి ఆదరణ పొందుతోంది.**



Printed, Published by Mohammed Murthuza. Printed at Vivek Art Printers APHP SHOP NO.12, OSMANIA UNVERSITY ROAD,HYDERABAD. PUBLISHED ROOM NO.10, Ground Flour, Budha Bhavan, M.G.Road, Secunderabad -03. Ali Publication, Hyderabad. www.samayam.net Mobile No. 98660 19778, 89789 60131.